విశాల భారతి
23-02-2026
తెలుగు దినపత్రిక
www.vishalabharati.com
epaper.vishalabharati.com
సోమవారం, హైదరాబాద్
సంపుటి:4 సంచిక: 52


## కాంగ్రెస్ మురికి రాజకీయాలు

- ఢిల్లీ ఏఐ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శన
- గ్లోబల్ ఈవెంట్‌ను మురికి రాజకీయాలకు వాడుకున్నారని మోదీ ఫైర్
- విదేశీ ప్రతినిధుల ముందు దేశ పరువు తీశారని ఆవేదన
- మేరఠ్ సభలో కాంగ్రెస్ తీరును ఎండగట్టిన ప్రధానమంత్రి
- అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై నిరసనకారుల ఆగ్రహం
- భద్రతా సిబ్బంది అదుపులో 15 మంది ఐవైసీ కార్యకర్తలు



**విశాలభారతి, జాతీయం:**

ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఎంతో ఆశగా చూస్తున్న తరుణంలో, రాజధాని ఢిల్లీ వేదికగా జరిగిన గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా పెను దుమారం రేపుతున్నాయి. సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రపంచానికి మిగతా 6లో..

# కేసీఆర్ తప్పుల్ని ప్రజలు క్షమించరు

## ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే గోదావరి జలాల వివాదమే ఉండేది కాదు

## కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్లు కుమ్మరించడం వల్లే నిధుల కరువు

- మేడిగడ్డ కుంగినా రికార్డు స్థాయిలో వరి సాగు బీఆర్ఎస్ వాదనల్లో పస లేదు
- తప్పులు చేసిన వారే నీతులూ చెబుతున్నారు అసెంబ్లీలో తేల్చుకుందాం రండి
- ప్రజల తీర్పును గౌరవించకుండా ఓటర్లను అవమానించడం బీఆర్ఎస్ నేతలకు తగదు
- ఏపీతో జల జగడాలను సామరస్యంగా పరిష్కరించుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం

**తెలంగాణ సాగునీటి రంగం గత పదేళ్లుగా రాజకీయ క్రీడకు వేదికైందని, గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాల వల్లే నేడు రాష్ట్రం గోదావరి జలాల విషయంలో సవాళ్లను ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ అనుసరించిన వైఖరిని ఎండగట్టారు. గత పదేళ్ల కాలంలో ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే నేడు రాజకీయ రంగు పులుముకున్న ఈ నీటి వివాదాలకు ఆస్కారమే ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గత పాలకులు కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దేవాదుల వంటి కీలక ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడిందని, భూసేకరణ పనులు నిలిచిపోయాయని వివరించారు. ఆరు వేల కోట్ల అంచనాతో ప్రారంభమైన దేవాదుల ప్రాజెక్టు వ్యయం నేడు 18 వేల కోట్లకు చేరడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేరుతో ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించడం వల్ల సామాన్య రైతులకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన తర్వాత అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయలేదని, అయినప్పటికీ రాష్ట్రంలో వరి దిగుబడి రికార్డు స్థాయిలో రావడం గమనార్హమని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కాళేశ్వరం నిరుపయోగంగా ఉన్నా పంటలు పండుతున్నాయంటే, అది ప్రకృతి సహకారం, రైతుల శ్రమ అని, కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం అంతా తమ వల్లే మిగతా 2లో..



## బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్

- కామారెడ్డి భూవివాదంతో రాజుకున్న కాంగ్రెస్-బీజేపీ రాజకీయ యుద్ధం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గృహ నిర్బంధం
- అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ బీజేపీ నేతల ఆగ్రహం
- ముందస్తు అరెస్టులతో ఉలిక్కిపడ్డ హైదరాబాద్, కామారెడ్డి ప్రాంతాలు
- తెలంగాణలో రౌడీ రాజ్యం నడుస్తోందని బండి సంజయ్ తీవ్ర విమర్శలు
- నేతల సవాళ్లు, క్యాడర్ ఆందోళనలతో స్థానికుల్లో నెలకొన్న ఆందోళన




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కామారెడ్డి వేదికగా పెను దుమారం రేగుతోంది. భూముల వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య మొదలైన మాటల యుద్ధం కాస్తా ఇప్పుడు రెండు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఆదివారం ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావును పోలీసులు హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్టు చేయడం ఒక్కసారిగా రాజకీయ సెగను పెంచేసింది. మిగతా 3లో..

## అగరబత్తీలు పొగతో ప్రాణాపాయం

- అగరబత్తీలు, ధూపం పొగతో పొంచి ఉన్న తీవ్ర ఆరోగ్య ముప్పు
- కృత్రిమ రసాయనాలు, బొగ్గు పొడి వాడకంపై 'బిఐఎస్' కీలక నిబంధనలు
- గదుల్లో పేరుకుపోయే పొగ వల్ల ఊపిరితిత్తులు, గుండె జబ్బుల ప్రమాదం
- అగరబత్తీల పొగ సిగరెట్ పొగ కంటే ప్రమాదకరమని వైద్యుల హెచ్చరిక
- కృత్రిమ సుగంధాలకు బదులుగా సహజసిద్ధమైన 'ఆర్గానిక్' ఉత్పత్తులకే ప్రాధాన్యం
- భక్తితో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని నిపుణుల సూచన

03



## 'మోస్ట్ వాంటెడ్' ఉగ్రవాది సైపుల్లా హతం!

- జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాల భారీ ఆపరేషన్.. టాప్ ఉగ్రవాది సైపుల్లా ఖతం
- కిష్టవాడ్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం
- 20 సార్లు ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న 'మోస్ట్ వాంటెడ్' ఉగ్రవాదికి ముగింపు
- 'ఆపరేషన్ త్రాషి-1' పేరుతో ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడ్డ సైన్యం, పోలీసులు

03

# ముగిసిన ఎర్ర శకం

- దేవ్ జీ, రాజిరెడ్డి లొంగుబాటు వార్తలతో అగ్ర నాయకత్వం ఖాళీ
- తెలంగాణ పోలీసుల వ్యూహాత్మక ఆపరేషన్ విజయవంతం
- ఆపరేషన్ కగార్ డెడ్ లైన్ ముందే కీలక పరిణామాలు
- కేడర్‌లో నైతిక స్థైర్యం దెబ్బతిన్నట్లు విశ్లేషణలు
- ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస ప్యాకేజీల ప్రభావం
- దామోదర్, గణపతి ఆచూకీపై కొనసాగుతున్న ఉత్కంఠ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు పార్టీకి తెలంగాణ గడ్డపై కోలుకోలేని దెబ్బ తగిలింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతితో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు వస్తున్న వార్తలు ఇప్పుడు ఉభయ రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ మిగతా 2లో..



## సర్కార్ నెత్తిన మెట్రో కొండ

- ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం చేతుల్లోకి మెట్రో
- రూ. 15,000 కోట్ల భారీ ఆర్థిక సెటిల్మెంట్
- ప్రభుత్వంపై పడనున్న రూ. 13,000 కోట్ల అప్పు భారం
- మార్చి 31 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని డెడ్‌లైన్
- ఐడీబీఐ క్యాపిటల్, డీఎంఆర్‌సీ సలహాలతో అడుగులు
- రేపటి కేబినెట్ భేటీలో తుది నిర్ణయం వచ్చే అవకాశం

02

## రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి సీఎం నివాళులు

**మహబూబాబాద్ , విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రెడ్యాల గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల పితృవియోగం చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిగ్ టివి చైర్మన్ వెన్నం విజయ్ కాంత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారి తండ్రి స్వర్గీయ రాఘవేందర్ రెడ్డి చిత్రపటం ఎదుట సీఎం పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. మిగతా 4లో..



## మూసీ ముసుగులో భూముల దోపిడీ

- సీఎం రేవంత్ రెడ్డి ప్రతి అడుగు వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ఉన్నాయి
- మూసీ సుందరీకరణ కాదు.. అది పేదల ఇళ్లను కూల్చే 'బుల్డోజర్' పాలన
- ఫోర్త్ సిటీ పేరుతో వేల ఎకరాల భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు

02




# ఆసరా కోసం ఎదురుచూపులు

- కొత్త పింఛన్ల మంజూరులో తీవ్ర జాప్యం , పెరుగుతున్న దరఖాస్తుల పెండింగ్
- వృద్ధులు, వికలాంగుల ఆర్థిక ఇబ్బందులు, మందుల ఖర్చులకూ అవస్థలు
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం క్షేత్రస్థాయిలో అధికారుల నిరీక్షణ
- అర్హత ఉన్నా అందని సాయం, పెరిగిన లబ్ధిదారుల ఆవేదన
- గత ప్రభుత్వ బకాయిలు, ప్రస్తుత ప్రభుత్వ కొత్త నిబంధనల మధ్య సందిగ్ధం
- సాంకేతిక కారణాలతో ఆగిపోయిన వెరిఫికేషన్ ప్రక్రియ, ఆందోళనలో పేదలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో సంక్షేమ పథకాలకు వెన్నెముకగా నిలిచే ఆసరా పింఛన్ల వ్యవస్థ ప్రస్తుతం ఒక రకమైన స్తబ్దతలో చిక్కుకుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు కొత్త పింఛన్ల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత పాత పథకాలను కొనసాగిస్తూనే, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఆమోదం తెలిపే ప్రక్రియలో వేగం తగ్గడం పేదల పాలిట శాపంగా మారింది. క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయినప్పటికీ, మిగతా 3లో..

# మూసీ ముసుగులో భూముల దోపిడీ

- సీఎం రేవంత్ రెడ్డి ప్రతి అడుగు వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ఉన్నాయి
- మూసీ సుందరీకరణ కాదు.. అది పేదల ఇళ్లను కూల్చే 'బుల్డోజర్' పాలన
- ఫోర్త్ సిటీ పేరుతో వేల ఎకరాల భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధుకు లేని నిధులు విలాసాలకు ఎక్కడివి
- కేసీఆర్ నీళ్లిచ్చి బతికించారు.. రేవంత్ ఇళ్లు కూల్చి రోడ్డున పడేస్తున్నారు
- బాధితుల పక్షాన అసెంబ్లీలోనూ, కోర్టుల్లోనూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'మూసీ' చిచ్చు రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ఖచ్చితంగా రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాలే దాగి ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి వేసే ప్రతి అడుగులోనూ భూముల పంచాయతీలు, రియల్ ఎస్టేట్ దోపిడీ కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇళ్లు కోల్పోతున్న హైదర్ షా కోట్ లోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులను ఆయన పరామర్శించారు. గతంలో సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవాలని చూస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, అటు ఎల్టీపీఎస్ భూములను కబ్జా చేసి వ్యాపారం చేయాలని చూసిన చరిత్ర ఈ ప్రభుత్వానిదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తీరు చేస్తున్నది మూసీ ప్రక్షాళన కాదని, పేదల ఇళ్లను కూల్చి కార్పొరేట్ శక్తులకు భూములను ధారాదత్తం చేసే కుట్ర అని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన 14,000 ఎకరాలను, రేవంత్ రెడ్డి 'ఫోర్త్ సిటీ'గా పేరు మార్చి రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఆశలను బుల్డోజర్లతో తొక్కుతున్నారని, ఆ భూములను అంబానీ, అదానీ లేదా మెగా కృష్ణారెడ్డి లాంటి బడా బాబులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పాలకుల జేబులు నింపుకోవడానికి చేసే ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

పాలనలో కేసీఆర్ మార్క్ అంటే ప్రజల జీవితాలను నిలబెట్టడం, కానీ నేటి రేవంత్ పాలన అంటే బుల్డోజర్లతో జీవితాలను కూలగొట్టడం అని హరీష్ రావు అభివర్ణించారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో కేసీఆర్‌కు ఎంతో అనుబంధం ఉందని, గతంలో ఇక్కడ నీటి సమస్య ఉన్నప్పుడు ప్రత్యేక పైపులైన్ వేయించి పరిష్కరించారని గుర్తు చేశారు. కేసీఆర్ ఎప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలని తపన పడితే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం జేసీబీలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. మూసీ శుద్ధికి తాము వ్యతిరేకం కాదని, కేసీఆర్ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని, కానీ ఒక్క ఇల్లు కూడా కూల్చాలనే ఆలోచన చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

ఒక భారీ ప్రాజెక్టు చేపట్టేటప్పుడు ఉండాల్సిన కనీస నిబంధనలను ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని హరీష్‌రావు విమర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ లేదని, ఎఫ్‌టీఎల్ ఖరారు కాలేదని, పర్యావరణ అనుమతులు కూడా లేకుండా నోటీసులు ఎలా ఇస్తారని నిలదీశారు. చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడానికి, రైతులకు రైతుబంధు ఇవ్వడానికి నిధులు లేవని చెప్పే ముఖ్యమంత్రికి.. వందల కోట్లతో కొత్త క్యాంపు ఆఫీసులు కట్టుకోవడానికి, మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు పైసలెక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తూ, పేదల ఇళ్లు కూల్చడం ఏ రకమైన న్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధితుల ఆర్తనాదాలు వింటుంటే మనసు తరుక్కుపోతోందని, తమ ఇండ్లు కూల్చే బదులు తమను చంపి ఇళ్లను తీసుకోండని తల్లులు ఆవేదన చెందుతున్నా రేవంత్ ప్రభుత్వానికి కనికరం లేదని హరీష్ రావు అన్నారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను ప్రభుత్వం బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన నిలబడి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కేసీఆర్ ఆదేశాల మేరకు చట్టపరంగా పూర్తి స్థాయి న్యాయపోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. పేదవాడి సొంతింటి కలపై ఈ ప్రభుత్వం చేస్తున్న దాడిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఆయన హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత హైదరాబాద్‌లో కొత్తగా కట్టిన ఇల్లు ఒక్కటి కూడా లేదని, కానీ కూల్చిన ఇళ్లు, ఛిద్రం చేసిన బతుకులు మాత్రం ఎన్నో ఉన్నాయని హరీష్ రావు ఎద్దేవా చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగినా, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు అడిగినా, రైతులకు రైతుబంధు అడిగినా ప్రభుత్వం దగ్గర పైసల్లేవని చెబుతున్నారని మండిపడ్డారు. గురుకులాల్లో సరైన భోజనం లేక 162 మంది విద్యార్థులు చనిపోయినా పట్టించుకోకుండా, రాష్ట్రం దివాలా తీసింది నన్ను కోసుకు తింటారా అని సీఎం మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సంక్షేమానికి నిధులు లేనప్పుడు విలాసవంతమైన పోటీలకు, మెస్సీ మ్యాచ్‌లకు వందల కోట్లు ఎలా వెచ్చిస్తున్నారని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి తన విలాసాల కోసం జూబ్లీహిల్స్‌లో రూ. 100 కోట్లతో క్యాంపు ఆఫీస్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రూ. 5 కోట్లతో మూడో క్యాంపు ఆఫీస్ కట్టుకోవడానికి ప్రజల సొమ్ము వాడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బడా కాంట్రాక్టర్లకు ఇప్పటికే రూ. 20,000 కోట్ల బిల్లులు చెల్లించారని, ఇప్పుడు ఎవరి జేబులు నింపడానికి మూసీ ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. పేదలకు ఇవ్వడానికి లేని డబ్బులు, కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి దగ్గర ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. మూసీని అభివృద్ధి చేయాలంటే ఎస్టీపీలు కట్టి మురుగునీరు రాకుండా చేయాలని, కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం పైపులైన్ల ద్వారా గోదావరి నీళ్లను తెచ్చి ప్రక్షాళన చేయాలని సూచించారు.

## కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే సహించం

**పాల్వంచ విశాల భారతి:**

కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే సహించబోమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని వనమా కాలనీలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కోనేరు చిన్నిని వనమా కాలనీ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరైతే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వము అని, బిల్లులు ఆపేస్తామని స్థానిక సిపిఐ నేతలు బెదిరించినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. సంక్షేమ పథకాలు ఆపేస్తామని సిపిఐ నేతలు బెదిరింపులకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి కాంగ్రెస్ కార్యకర్తలందరూ శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, సీపీఐ నేతల బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన ఎస్.జె.కె. అహ్మద్‌ను కోనేరు చిన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు, మూడవ డివిజన్ కార్పొరేటర్ హోలీ శ్రీను, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, చింతా నాగరాజు, కాపర్తి వెంకటాచారి, ముస్లిం మైనారిటీ నాయకులు మస్తాన్ ఖురేషి, ఎండి అక్బర్, స్థానికులు కొత్త సిద్ధారెడ్డి, ఏవి రాఘవులు, బోన లక్ష్మీనారాయణ, చిమ్మినాయుడు, రావూఫ్, రజాక్, షబ్బీర్ ఎస్.డి.అంజద్, జిల్లెపల్లి స్టాలిన్, గద్దర్ భాష, ఖాసిం, వేలాద్రి, శనగ రామచంద్ర, స్థానిక మహిళలు సక్కుబాయి, విజయ, లంక రాణి, వరలక్ష్మి, మదీనా, సుజాత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ఎర్ర శకం

**మొదటిపేజీ తరువాయి**

అటవీ ప్రాంతం నుంచి వీరిని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసుల పహారాలో ఉన్న ఈ ఇద్దరు కీలక నేతలను నేడో, రేపో మీడియా ముందుకు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. తెలంగాణ మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ ఇద్దరు నేతల లొంగుబాటుతో రాష్ట్రంలో ఆ పార్టీ ఉనికి దాదాపు నామమాత్రంగా మారినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి విద్యార్థి దశలోనే విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. అప్పటి పీపుల్స్ వార్ పార్టీలో చేరి, తనదైన శైలిలో అంచెలంచెలుగా ఎదిగి చివరికి పార్టీ అత్యున్నత పదవి అయిన ప్రధాన కార్యదర్శి పీఠాన్ని అధిరోహించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తిరుపతి నాయకత్వంపై పార్టీలో భిన్న స్వరాలు వినిపించినప్పటికీ, ఆయన వ్యూహకర్తగా పార్టీని నడిపించారు. అయితే, ఇటీవలి కాలంలో పార్టీ తీవ్రమైన నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోంది. నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజు తర్వాత బాధ్యతలు చేపట్టిన దేవ్ జీ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో విఫలమయ్యారనే చర్చ కూడా సాగుతోంది. ఈ క్రమంలోనే ఆయన లొంగుబాటు నిర్ణయం తీసుకోవడం కేడర్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం చేసిన ప్రకటన ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ అధికారిక ప్రకటన వెలువడక ముందే దేవ్ జీ, రాజిరెడ్డిల నుంచి పోలీసులకు సానుకూల సంకేతాలు అందినట్లు సమాచారం. ఆదిలాబాద్, మహదేవ్ పూర్ అటవీ ప్రాంతాల్లో భారీ ఎత్తున జరిగిన కూంబింగ్ ఆపరేషన్లు కేవలం రక్షణ కోసం మాత్రమే కాకుండా, ఈ నేతల లొంగుబాటుకు మార్గం సుగమం చేయడానికి కూడా జరిగినట్లు తెలుస్తోంది. గతంలోనే లొంగిపోయిన మల్లోజు వేణుగోపాల్ వంటి వారు కూడా తన సహచరులను బయటకు రావాలని కోరడం ఈ పరిణామాలకు బలాన్ని చేకూర్చింది.

అయితే ఇప్పుడు అందరి కళ్లు మరో ముఖ్య నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మీద ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న దామోదర్ కూడా పోలీసుల అదుపులో ఉన్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మేడారం అటవీ ప్రాంతంలో ఆయన సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఒకవేళ దామోదర్ కూడా లొంగిపోయి ఉంటే, తెలంగాణలో మావోయిస్టు పార్టీ రాష్ట్ర స్థాయి నాయకత్వం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లే అవుతుంది. ఇదే సమయంలో మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాల లక్ష్మణరావు ఎక్కడ ఉన్నారనేది మిస్టరీగా మారింది. అనారోగ్య కారణాలతో ఆయన ఎప్పుడో క్రియాశీల రాజకీయాలకు దూరమైనా, ఆయన ఆచూకీపై మాత్రం స్పష్టత లేదు. మరోవైపు సరిహద్దుల్లో ఇంకా ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. కీలక నేతలు లొంగుబాటు బాట పట్టినప్పటికీ, కర్రెగుట్టల్లో భారీ ఎత్తున సాయుధ బలగాలతో ఆపరేషన్ ఎందుకు నిర్వహిస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. అక్కడ ఇంకా ఎవరైనా అగ్రనేతలు తలదాచుకున్నారా లేదా మిగిలి ఉన్న దళాలను ఏరివేయడానికి ఈ చర్యలు చేపడుతున్నారా అనేది పోలీసులు బయట పెట్టడం లేదు. విజయవాడలో దేవ్ జీ సెక్యూరిటీ టీమ్ సభ్యులు పట్టుబడటం, ఆపై హిడ్మా ఎన్‌కౌంటర్ సమయంలో దేవ్ జీ దొరికిపోయారనే పుకార్లు రావడం వంటి సంఘటనలన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. ఏది ఏమైనా అగ్ర నాయకత్వం ఒక్కొక్కరుగా పక్కకు తప్పుకోవడంతో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఇప్పుడు చివరి అంకానికి చేరుకుంది. మార్చి 31వ తేదీ నాటికి దేశం నుంచి మావోయిస్టుల ఉనికిని తుడిచిపెట్టాలన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యం నెరవేరుతున్నట్లు కనిపిస్తోంది. డెడ్ లైన్‌కు మరో 40 రోజుల సమయం ఉండగానే ప్రధాన కార్యదర్శి స్థాయి నేతలే లొంగిపోవడం కేంద్ర బలగాల వ్యూహానికి నిదర్శనం. ముఖ్యంగా దండకారణ్యంలో మావోయిస్టులకు కంచుకోటలా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు జవాన్ల పట్టు పెరిగింది. మిగిలి ఉన్న అతికొద్ది మంది నేతలు కూడా ఈ గడువు లోగా ఎన్‌కౌంటర్లలో మరణించడమో లేదా లొంగిపోవడమో జరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమిత్ షా శనివారం చేసిన ప్రకటన కూడా ఈ విజయ సంకేతాలనే ప్రతిబింబిస్తోంది. మొత్తానికి దేవ్ జీ, రాజిరెడ్డిల లొంగుబాటు తెలంగాణ పోలీసుల చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన సాయుధ పోరాటం ఇప్పుడు తన ముగింపు దశకు చేరుకున్నట్లు స్పష్టమవుతోంది. ఒకప్పుడు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అని నినదించిన గొంతుకలు, ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలో పునరావాసం కోసం అన్వేషించడం మారుతున్న కాలానికి సంకేతం. అగ్రనేతల నిష్క్రమణతో కేడర్ చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉండటంతో, రానున్న రోజుల్లో మరింత మంది మావోయిస్టులు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ పరిణామాలు తెలంగాణ అటవీ ప్రాంతాల్లో శాశ్వత శాంతికి బాటలు వేస్తాయని సామాన్యులు ఆశిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, చర్చల ద్వారానే పరిష్కారాలు సాధ్యమని ఈ పరిణామాలు మరోసారి నిరూపిస్తున్నాయి.

ప్రస్తుతానికి ఈ లొంగుబాటు అంశంపై అధికారిక ప్రకటన కోసం అంతా ఎదురుచూస్తున్నారు. పోలీసు విభాగం అత్యంత గోప్యతను పాటిస్తున్నప్పటికీ, లోపల జరుగుతున్న పరిణామాలు మాత్రం మావోయిస్టు పార్టీ అంతర్థానాన్ని సూచిస్తున్నాయి. కేవలం నాయకత్వం మాత్రమే కాదు, పార్టీ సిద్ధాంతం కూడా నేటి తరం యువతను ఆకట్టుకోలేకపోవడం కూడా ఈ పతనానికి ఒక కారణంగా చెప్పవచ్చు. రాబోయే 24 గంటల్లో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించబోయే పునరావాస ప్యాకేజీలు, ఇతర ప్రయోజనాలు భవిష్యత్తులో మిగిలిన వారు కూడా జనజీవన స్రవంతిలో కలవడానికి ప్రోత్సాహకంగా నిలవనున్నాయి. ఒక సుదీర్ఘ పోరాట చరిత్ర ఇలా నిశ్శబ్దంగా ముగిసిపోవడం చరిత్రలో ఒక పెద్ద మలుపుగా మిగిలిపోనుంది.



# కేసీఆర్ తప్పుల్ని ప్రజలు క్షమించరు

**మొదటిపేజీ తరువాయి**

జరిగిందని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధికి, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన మార్పులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, కేసీఆర్, హరీశ్ రావు చేసిన తప్పులను గుర్తించే ప్రజలు వారికి తగిన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

అసెంబ్లీ వేదికగా సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు తాము సిద్ధమని, పదేళ్లు అధికారంలో ఉన్న అనుభవంతో బీఆర్ఎస్ నేతలు ఏవైనా నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జలాల విషయంలో తాము ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తున్నామన్న విపక్షాల ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని కొట్టిపారేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రజల ప్రయోజనాలు , నీటి సమస్యల విషయంలో రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రతిపక్షం సహకరించాలే తప్ప ప్రతిబంధకంగా మారకూడదని కోరారు. ఓటమి తర్వాత బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత విచారకరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజలు తమకు అధికారం ఇవ్వకపోవడం వారి తప్పన్నట్లుగా గులాబీ నేతలు మాట్లాడుతున్నారని, ఓటు వేసిన ప్రజలనే బహిష్కరించినట్లుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని, విజ్ఞతతో వ్యవహరించాలని హితవు పలికారు. పదేళ్ల పాటు అధికారాన్ని అనుభవించి, ఇప్పుడు ప్రజల తీర్పుపై విమర్శలు చేయడం వారి అహంకారానికి నిదర్శనమని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.



రాబోయే రెండు మూడేళ్ల కాలంలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం ఉందని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వం వదిలేసిన సమస్యలను తాము చక్కదిద్దుతున్నామని, అన్ని ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష నిర్వహించి నిధుల కేటాయింపులు జరుపుతున్నామని చెప్పారు. భూసేకరణ సమస్యలను పరిష్కరించి, సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టడమే తమ లక్ష్యమని వివరించారు. రైతాంగానికి భరోసా కల్పించి, ప్రతి ఎకరాకు నీరు అందించే వరకు విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి కుర్చీ అనేది ఎవరికీ వారసత్వంగా రాదని, అది ప్రజలు ఇచ్చే అవకాశమని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు వరుసగా రెండుసార్లు అవకాశం ఇచ్చారని, అదేవిధంగా తమ ప్రభుత్వ పనితీరును చూసి ప్రజలు మళ్లీ ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకత్వం అనేది బాధ్యతతో కూడుకున్నదని, అధికార గర్వంతో ప్రజలను విస్మరిస్తే ఏ గతి పడుతుందో గత పాలకుల పరిస్థితి చూస్తే అర్థమవుతుందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుస్తుందని హామీ ఇచ్చారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం గాలికి వదిలేయదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులను వృథా కానివ్వబోమని, నిపుణుల కమిటీ ఇచ్చే సూచనల మేరకు మరమ్మతులు చేపట్టి మళ్ళీ వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. గతంలో జరిగిన సాంకేతిక లోపాలను సరిదిద్ది, పకడ్బందీగా ముందుకు వెళ్తామని చెప్పారు. ప్రాజెక్టుల వైఫల్యాలకు బాధ్యులైన వారిని వదిలే ప్రసక్తే లేదని, చట్టపరమైన చర్యలు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు.

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న నీటి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని, అదే సమయంలో పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కొనసాగిస్తామని చెప్పారు. వివాదాల వల్ల ప్రాజెక్టులు ఆగిపోకూడదన్నదే తమ అభిమతమని, సామరస్య పూర్వక చర్చల ద్వారా పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలి
- ఎం వి రమణ కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు




**ఖమ్మం, విశాలభారతి:** ఖమ్మం జిల్లా సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బొడపట్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు M.v రమణ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికులకు ప్రతిసారి అన్యాయమే జరుగుతుందన్నారు. గత సంవత్సరం బడ్జెట్లో 70 కోట్లు మాత్రమే కేటాయించారు అవి కూడా డబ్బులు లేవనే పేరుతో విడుదల చేయలేదు. కేవలం 17 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్లోనైనా 5 వేల కోట్లు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, పెన్షన్ 2 వేల నుండి 4 వేలకు పెంచుతామని, ఎక్సిగ్రేషియా 10 లక్షలకు పెంచుతామని అది కూడా నెల రోజుల లోపే ఇస్తామని చెప్పారు. ఈ నెల 17 తేదీన ఇందిరా పార్క్ వద్ద KGKS ఆధ్వర్యంలో జరిగిన నిరాహార దీక్షకు స్పందించిన ప్రభుత్వం 3 కోట్ల రూపాయలు మాత్రమే రిలీజ్ చేశారు, మిగతా 11 కోట్ల రూపాయలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముట్టడిస్తాం అని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి కొండం కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్, మర్రికంటి శ్రీను, మొక్క నాగేశ్వరరావు, రెడ్డిమళ్ళ వెంకటయ్య, బొడపట్ల నాగేశ్వర్ రావు, మడిపల్లి వెంకన్న, మద్దెల పుల్లరావు, ముత్యం రామకృష్ణ, అల్లాడి వెంకటేశ్వర్ రావు, గుండ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ నెత్తిన మెట్రో కొండ




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర ప్రయాణ ముఖచిత్రాన్ని మార్చేసిన మెట్రో రైలు ఇప్పుడు సరికొత్త మలుపు తిరుగుతోంది. ఇన్నాళ్లూ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో సాగిన ఈ ప్రయాణం ఇకపై పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలోకి వెళ్లనుంది. గ్రేటర్ సిటీ రవాణా వ్యవస్థలో కీలకమైన మెట్రోను ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియ ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. కేవలం బోర్డులు మార్చడం ద్వారా జరిగే మార్పు కాదిది, వేల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు, సంక్లిష్టమైన ఒప్పందాల పరిష్కారంతో ముడిపడి ఉన్న భారీ ఆపరేషన్ అని చెప్పవచ్చు.

మెట్రోను ప్రభుత్వపరం చేయాలంటే సుమారు 15,000 కోట్ల రూపాయల భారాన్ని ఖజానా భరించాల్సి ఉంటుందని అంచనా. ఈ ప్రాజెక్టును టేకోవర్ చేసే క్రమంలో ఎదురవుతున్న అతిపెద్ద సవాలు ఎల్ అండ్ టీ సంస్థకున్న అప్పులే. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1పై సుమారు 13,000 కోట్ల రూపాయల మేర అప్పు ఉంది. ఒక ప్రైవేట్ సంస్థ నుంచి ప్రాజెక్టును తీసుకుంటున్నప్పుడు, ఆ సంస్థ పేరిట ఉన్న ఈ భారీ రుణాన్ని కూడా ప్రభుత్వం తన ఖాతాలోకి మళ్లించుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు ఎల్ అండ్ టీ పెట్టిన ఈక్విటీ పెట్టుబడికి ప్రతిఫలంగా మరో రూ. 2,100 కోట్ల వరకు వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద చెల్లించాల్సి రావడం గమనార్హం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఇంతటి భారీ మొత్తాన్ని సమీకరించడం సామాన్యమైన విషయం కాదు. అయితే మెట్రోను లాభదాయకంగా మార్చాలన్నా, ఫేజ్ 2 విస్తరణ వేగంగా జరగాలన్నా ఈ బాధ్యత తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. అందుకే ప్రభుత్వం ఇప్పటికే ఐడీబీఐ క్యాపిటల్‌ను ఆర్థిక సలహాదారుగా నియమించి, ఆర్థిక సాధ్యాసాధ్యాలపై లోతైన అధ్యయనం చేయించింది. అలాగే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ సాంకేతిక అంశాలను పర్యవేక్షిస్తోంది. వీరిద్దరి నివేదికల ఆధారంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రైవేట్ భాగస్వామ్యంతో వచ్చే ఇబ్బందుల కంటే, సొంతంగా నిర్వహించడమే మేలని సర్కారు భావిస్తోంది. న్యాయపరమైన అంశాలు కూడా ఈ టేకోవర్ ప్రక్రియలో అత్యంత కీలకంగా మారాయి. గతంలో కుదుర్చుకున్న సప్లిమెంటరీ కన్సెషన్ అగ్రిమెంట్ల ప్రకారం ప్రభుత్వం ఎల్ అండ్ టీకి ఇవ్వాల్సిన రూ. 2,100 కోట్ల వడ్డీ లేని రుణం అంశం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ బకాయిల చెల్లింపుపై ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ ఖరారు కానుంది. ఈ భేటీ తర్వాతే నిధుల సమీకరణకు సంబంధించిన మార్గాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ మొత్తాన్ని బాండ్ల రూపంలో సేకరిస్తుందా లేదా బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటుందా అనేది ఆసక్తికరంగా మారింది. నిజానికి మెట్రో ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో లాభాలు గడించలేకపోవడం, ఏటా వందల కోట్ల నష్టాలను చవిచూడటంతో ఎల్ అండ్ టీ సంస్థ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని మొదటి నుంచీ యోచిస్తోంది.

# అగరబత్తీలు పొగతో ప్రాణాపాయం

**ఆరోగ్యమస్తు:**

భారతీయ సంప్రదాయంలో పూజకు, అగరబత్తీలకు విడదీయలేని అనుబంధం ఉంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దేవుడి ముందు దీపారాధన చేసి, అగరబత్తీలు వెలిగించడం మన ఇళ్లల్లో తరతరాలుగా వస్తున్న ఆచారం. ఆ సుగంధం ఇల్లంతా వ్యాపించినప్పుడు మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక భావన కలుగుతాయని మనం నమ్ముతాం. అయితే, భక్తితో మనం వెలిగించే ఈ అగరబత్తీల వెనుక ఒక అదృశ్య ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్లో లభిస్తున్న చాలా రకాల అగరబత్తీలు మనం అనుకున్నంత స్వచ్ఛమైనవి కావని, అవి మన ఆరోగ్యాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని భారత ప్రమాణాల సంస్థ అగరబత్తీల తయారీపై కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. గతంలో అగరబత్తీలను సహజసిద్ధమైన మూలికలు, పూల పొడి, నెయ్యి వంటి వాటితో తయారు చేసేవారు. కానీ ఇప్పుడు అధిక లాభాల కోసం తయారీదారులు హానికరమైన రసాయనాలను వాడుతున్నారు. సువాసనల కోసం కృత్రిమ సుగంధ ద్రవ్యాలు, మంట ఆరకుండా ఉండేందుకు ప్రమాదకరమైన ఫతలేట్స్, బొగ్గు పొడిని విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇవి కాలినప్పుడు వెలువడే పొగలో సూక్ష్మ ధూళి కణాలు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విషవాయువులు గాలిలో కలుస్తున్నాయి.



ఈ అంశంపై ఒమేగా హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన వంశీ ఒక వీడియో ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. మూసి ఉన్న గదుల్లో అగరబత్తీలు వెలిగించి ఆ పొగను పీల్చడం వల్ల శ్వాసనాళాల్లో మంట పుడుతుందని ఆయన వివరించారు. ఈ పొగ నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం వల్ల ఆస్తమా, బ్రోన్కైటిస్ వంటి సమస్యలు తీవ్రమవుతాయి. దీర్ఘకాలంలో ఈ అలవాటు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కూడా దారితీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా గాలి ఆడని గదుల్లో ఈ పొగ సాంద్రత పెరిగి సిగరెట్ పొగ కంటే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ కలుషిత గాలి ప్రభావం కేవలం శ్వాసకోశానికే పరిమితం కాకుండా గుండె సంబంధిత వ్యాధులకు కూడా దారితీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తపోటు పెరగడం, గుండె వేగంలో మార్పులు వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇంట్లో ఉండే చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ పొగ వల్ల మరింత త్వరగా ప్రమాదానికి గురవుతారు. పసిపిల్లల ఊపిరితిత్తులు చాలా సున్నితంగా ఉంటాయి కాబట్టి, ఈ రసాయన పొగ వల్ల వారికి చిన్న వయసులోనే అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. అందుకే భక్తి పేరుతో ఇంటిని పొగతో నింపేయడం ఆరోగ్యకరమైన అలవాటు కాదని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

మనం పాటించే సంప్రదాయాలను తప్పు పట్టడం ఈ నిబంధనల ఉద్దేశం కాదని, కేవలం ప్రజారోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మనం గ్రహించాలి. పండుగలు లేదా ప్రత్యేక పూజా కార్యక్రమాల సమయంలో అప్పుడప్పుడు వెలిగిస్తే పెద్దగా నష్టం ఉండకపోవచ్చు కానీ, ప్రతిరోజూ గంటల తరబడి అగరబత్తీల పొగను పీల్చడమే ప్రధాన సమస్యగా మారుతోంది. భక్తికి, ఆరోగ్యానికి మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం నేటి తరంపై ఉంది. ప్రాచీన కాలంలో వెలిగించిన ధూపం వేరు, నేటి రసాయనాలతో కూడిన అగరబత్తీలు వేరు అనే వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సి ఉంది.

ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో చౌకగా దొరికే అగరబత్తీల వైపు మొగ్గు చూపడం ప్రమాదకరం. అగరబత్తీల ప్యాకెట్లపై బిఐఎస్ గుర్తింపు ఉందో లేదో సరిచూసుకోవడం ఇప్పుడు తప్పనిసరి. రసాయనాలు లేని, సహజసిద్ధమైన పూల వ్యర్థాలు లేదా ఆవు పేడతో తయారైన 'ఆర్గానిక్' అగరబత్తీలు లేదా ధూప్ స్టిక్స్ ఎంచుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి కాస్త ఖరీదైనవి అయినప్పటికీ, వీటివల్ల వెలువడే పొగలో విష రసాయనాలు ఉండవు. సువాసన కోసం కృత్రిమ పద్ధతులకు బదులుగా సహజమైన నూనెలను వాడే ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

ఇంట్లో అగరబత్తీలు వెలిగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా వైద్యులు పలు సూచనలు చేశారు. ధూపం వేసే సమయంలో గదిలో కిటికీలు, తలుపులు తెరిచి ఉంచడం వల్ల గాలి రాకపోకలు మెరుగ్గా ఉండి పొగ బయటకు వెళ్లిపోతుంది. ఏరోజూ పూజ గదిని ఒక పొగ గదిలా మార్చకూడదు. అలాగే ఒకేసారి గుప్పెడు అగరబత్తీలు వెలిగించే బదులు, కేవలం ఒకటి లేదా రెండు మాత్రమే వెలిగించి భక్తిని చాటుకోవడం మంచిది. సువాసన కోసం అగరబత్తీలపైనే ఆధారపడకుండా, తాజా పూలను వాడటం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు స్వచ్ఛమైన గాలి కూడా లభిస్తుంది.

చాలామంది అగరబత్తీలతో పాటు సాంబ్రాణిని కూడా వాడుతుంటారు. సహజమైన సాంబ్రాణి గాలిని శుద్ధి చేస్తుందని పెద్దలు చెబుతారు. కానీ మార్కెట్లో దొరికే కల్తీ సాంబ్రాణి ఉండలు కూడా రసాయనాలతో నిండి ఉంటున్నాయి. బొగ్గును అధికంగా వాడటం వల్ల అది కాలినప్పుడు కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. అందుకే ఏ పదార్థం వెలిగించినా అది పర్యావరణానికి, మన ఆరోగ్యానికి ఎంతవరకు సురక్షితమో ఆలోచించాలి. ఆధునిక కాలంలో వస్తున్న ఎలక్ట్రానిక్ డిఫ్యూజర్లు కూడా ఒక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి, ఇవి పొగ లేకుండా సువాసనను అందిస్తాయి.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే పూజల వల్ల కలిగే పుణ్యం కంటే, అనారోగ్యం వల్ల కలిగే ఇబ్బందులే ఎక్కువవుతాయి. పర్యావరణ కాలుష్యం ఇప్పటికే మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కనీసం మన ఇంట్లోని గాలిని అయినా స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. మార్కెట్లో దొరికే చౌకబారు సుగంధ ద్రవ్యాల ప్రకటనలకు ఆకర్షితులు కాకుండా, నాణ్యమైన ఉత్పత్తులను వాడటం అలవాటు చేసుకోవాలి. భక్తి అనేది మనసులో ఉండాలి తప్ప, ప్రాణాలను పణంగా పెట్టే పొగలో కాదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

# 50%రాయితీతో వ్యవసాయ యంత్రాలు

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**విశాలభారతి, జనగామ:**



వ్యవసాయ యాంత్రీకరణ పథకం ( ఎస్ఎంఎస్ఎం)సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 50 శాతం రాయితీతో బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, రోటవేటర్లు, విత్తనాలు నాటే మెషిన్లు, కేజీ వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడ్డి కట్టే యంత్రాలు, డ్రోన్లు, ట్రాక్టర్లు, నాగలి, పవర్ టిల్లర్‌లు వంటి పరికరాలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.2025 26 సంవత్సరానికి జనగాం జిల్లాకు 2.73 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించబడిందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమకు నచ్చిన పరికరాన్ని ఎంచుకొని, సంబంధిత కంపెనీలకు రాయితీ మొత్తానికి మిగిలిన డబ్బును డిమాండ్ డ్రాఫ్ట్‌గా చెల్లించాల్సి ఉంటుందని,దరఖాస్తులు సంబంధిత వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద సమర్పించాలని,లక్ష రూపాయల లోపు విలువ గల పరికరాలకు మండల కమిటీ, లక్ష రూపాయలు కంటే ఎక్కువ విలువ గలవి జిల్లా కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు.

**ప్రతి రైతుకు ప్రత్యేకమైన యూనిక్ ఐడీ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి**

ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, తన ప్రత్యేక యూనిక్ ఐడీని పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం స్పష్టం చేశారు.ఈ రిజిస్ట్రేషన్ లేకుండా భవిష్యత్తులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం సాధ్యం కాదని వారు ప్రకటన ద్వారా హెచ్చరించారు.ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు ప్రత్యేకమైన యూనిక్ ఐడీగా పనిచేస్తుందని,ఈ ఐడీ ద్వారా రైతు భూముల పూర్తి వివరాలు సమగ్రంగా నమోదు అవుతాయని,ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, అర్హుతల గుర్తింపు, నేరుగా లబ్ధి బదిలీ (డిబిటి) సులభతరమవుతాయని,ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా ఈ కింది పథకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు రైతు బంధు,ఎరువుల సరఫరా (యూరియా ) - ఫర్టిలైజర్ యాప్ ద్వారాప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్)వ్యవసాయ యంత్రీకరణ పథకాలు (ఫార్మ్ మెకానైజషన్ )సబ్సిడీ విత్తనాలు,పంట ప్రదర్శనలు (క్రాప్ డిమాంస్ట్రేషన్స్ ) పంట ఉత్పత్తుల కొనుగోలు (క్రాప్ ప్రొడ్యూసర్ ప్రొకర్మెంట్)ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలు పొందవచ్చని,ఇంకా రిజిస్ట్రేషన్ చేయని రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలు, నమోదు ప్రక్రియ కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ ),గ్రామ వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు

# ఆసరా కోసం ఎదురుచూపులు

**మొదటిపేజీ తరువాయి**




తుది ఆమోదం లభించకపోవడంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇది కేవలం కాగితాల మీద లెక్క మాత్రమే కాదు, వేల కుటుంబాల జీవనాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షలకు పైగా కొత్త దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంలో చనిపోయిన వారి స్థానంలో కొత్త వారిని చేర్చే ప్రక్రియ కూడా మందకొడిగానే సాగుతోంది. వృద్ధాప్య పింఛన్ కోసం 57 ఏళ్ల వయోపరిమితిని ప్రామాణికంగా తీసుకున్న నాటి నుండి దరఖాస్తుల వెల్లువ పెరిగింది. అయితే, బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటు వంటి కారణాలతో కొత్త మంజూరు ఉత్తర్వులు జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ఏళ్ల తరబడి వేచి చూస్తున్న వృద్ధులలో ప్రభుత్వం పట్ల అసహనం వ్యక్తమవుతోంది. వికలాంగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. శారీరక వైకల్యంతో ఉపాధి పొందలేని వీరికి ప్రభుత్వ సాయమే ఏకైక మార్గం. సదరం క్యాంపుల ద్వారా సర్టిఫికెట్లు పొంది, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వేలాది మందికి నేటికీ పింఛన్ కార్డులు అందలేదు. పెరిగిన జీవన వ్యయం, వైద్య ఖర్చుల నేపథ్యంలో ఈ అరకొర సాయం కూడా సకాలంలో అందకపోవడం వారిని మానసిక వేదనకు గురిచేస్తోంది. వికలాంగుల పింఛన్‌ను భారీగా పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కనీసం ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. గతంలో కంటే ఇప్పుడు దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డు లింకేజీ, ఆధార్ అప్ డేషన్ వంటి సాంకేతిక అంశాలను సాకుగా చూపి అధికారులు దరఖాస్తులను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారి వృత్తిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోవాలన్నా, ఈ పింఛన్ సొమ్ము వారికి కొండంత అండగా ఉండేది, కానీ ఇప్పుడు అది కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ యంత్రాంగం చెబుతున్న లెక్కల ప్రకారం, నిధుల కొరత లేదని ప్రభుత్వం పైకి చెబుతున్నా, ఆచరణలో మాత్రం కొత్త కార్డుల పంపిణీ జరగడం లేదు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల జాబితా పెద్దదిగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాధాన్యతలు లేదా పరిపాలనాపరమైన చిక్కుల వల్ల ఈ ఫైళ్లు కదలడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచడం ఒక ఎత్తైతే, కనీసం అర్హులకు పింఛన్ మంజూరు చేయడం మరో ఎత్తు. ఈ రెండింటి మధ్య సామాన్యుడు నలిగిపోతున్నాడు. నగరాల్లో నివసించే నిరుపేదలకు కూడా ఈ జాప్యం పెద్ద సమస్యగా మారింది. అద్దె ఇళ్లలో ఉంటూ, కుటుంబ సభ్యులపై ఆధారపడలేక, పింఛన్ కోసం ఎదురుచూసే వృద్ధుల సంఖ్య గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే లక్షల్లో ఉంది. స్మార్ట్ సిటీలు, డిజిటల్ తెలంగాణ అని ప్రగల్భాలు పలుకుతున్నా, ఒక ముసలి ప్రాణానికి అందాల్సిన వెయ్యి రూపాయల సాయం కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం నేటి జనరేషన్‌కి ఒక వింతగా అనిపించవచ్చు. కానీ, అదే వెయ్యి రూపాయలు వారి ఆత్మగౌరవానికి, కడుపు నింపుకోవడానికి చిహ్నం.

సచివాలయం నుండి జిల్లా కలెక్టరేట్ల వరకు ఫైళ్లు పెండింగ్‌లో ఉండటం వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రతి నెల పింఛన్లు విడుదలయ్యే సమయంలో కొత్త పేర్లు చేరుతాయని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో 'అండర్ ప్రాసెస్' అనే స్టేటస్ నెలల తరబడి మారకపోవడం సాంకేతిక వైఫల్యమా లేక ఉద్దేశపూర్వక జాప్యమా అన్నది అస్పష్టంగా ఉంది. డేటా సెంటర్లలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్దాలని ఐటీ శాఖకు ఆదేశాలు ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో మార్పు కనిపించడం లేదు.

మరోవైపు, కొత్తగా అర్హత సాధించిన యువ వికలాంగులకు ఈ పింఛన్ వారి ఉన్నత చదువులకు లేదా స్వయం ఉపాధికి చిన్నపాటి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. అంగవైకల్యాన్ని అధిగమించి సమాజంలో నిలబడాలనుకునే వారికి ఈ జాప్యం పెద్ద అవరోధంగా మారుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి. కేవలం అంకెల్లో చూపించడం కాకుండా, నిజమైన లబ్ధిదారుల చేతికి పింఛన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలి. జనరేషన్ మారుతున్నా, పాలకులు మారుతున్నా పేదరికం , దాని అనుబంధ సమస్యలు అలాగే ఉన్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని త్వరితగతిన తీర్చడమే ఉత్తమ పరిపాలనకు నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం తన సంక్షేమ ఎజెండాలో పింఛన్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో నిజం కావాలి. కొత్త పింఛన్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్న కళ్లు రాష్ట్ర బడ్జెట్ వైపు కాకుండా, తమ బ్యాంకు ఖాతాల్లో పడే మెసేజ్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# 'మోస్ట్ వాంటెడ్' ఉగ్రవాది సైఫుల్లా హతం!

- **ఘటనా స్థలంలో ఏకే-47 రైఫిళ్లు, భారీగా యుద్ధ సామగ్రి స్వాధీనం**
- **దోడా-కిష్త్వాడ్ ప్రాంతంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ కొట్టిన బలగాలు**

**విశాలభారతి, జాతీయం:**



జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరులో భద్రతా బలగాలు సంచలన విజయం సాధించాయి. గత కొన్నేళ్లుగా భద్రతా దళాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న జైష్‌ఎమహమ్మద్ టాప్ కమాండర్, పాకిస్థానీ ఉగ్రవాది సైఫుల్లాను సైన్యం మట్టుబెట్టింది. ఆదివారం కిష్త్వాడ్ జిల్లాలో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో సైఫుల్లాతో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. చావోరేవో తేల్చుకోవాలన్న పట్టుదలతో సాగిన ఈ ఆపరేషన్, జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలకు గట్టి దెబ్బ కొట్టింది. సైఫుల్లా అనే పేరు వింటేనే భద్రతా దళాలు అప్రమత్తమయ్యే పరిస్థితి ఉండేది. తప్పించుకోవడంలో ఆరితేరిన ఇతడు, గత ఐదేళ్లలో సుమారు 20 సార్లు భద్రతా దళాల కళ్లుగప్పి ఎన్‌కౌంటర్ల నుంచి చాకచక్యంగా తప్పించుకున్నాడు. ప్రతిసారి సైన్యం ఉచ్చు బిగిస్తుందనుకున్న సమయంలో మంచు కొండల్లో మాయమవ్వడం ఇతడికి అలవాటు. అయితే ఈసారి నిఘా వర్గాలు అందించిన పక్కా సమాచారంతో పోలీసులు, సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ త్రాషి1'ను అత్యంత రహస్యంగా, వేగంగా ప్లాన్ చేశాయి. కిష్త్వాడ్ జిల్లాలోని చత్రూ బెల్ట్ పాసెర్‌కుట్ ప్రాంతంలో ఓ కొండ దిగువన ఉన్న మట్టి ఇంట్లో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు బలగాలకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతాన్ని క్లోజ్ రేంజ్ లో చుట్టుముట్టిన బలగాలు, ఉగ్రవాదులకు పారిపోయే అవకాశం లేకుండా చేశాయి. సైన్యం రాకను గమనించిన ఉగ్రవాదులు వెంటనే కాల్పులు ప్రారంభించారు. సుమారు గంటల తరబడి సాగిన ఈ ఎదురుకాల్పుల్లో బలగాలు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి ముగ్గురు ఉగ్రవాదులను అక్కడికక్కడే అంతం చేశాయి.

హతమైన వారిలో ఒకరిని మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది సైఫుల్లాగా ప్రాథమికంగా గుర్తించారు. ఇతడు దోడాకిష్త్వాడ్ ప్రాంతంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గత జూలై 2024లో నలుగురు భారత సైనికుల వీరమరణానికి కారణమైన దాడిలో సైఫుల్లానే ప్రధాన సూత్రధారి అని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతడిపై ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డును ప్రకటించింది. సైఫుల్లా మరణంతో ఆ ప్రాంతంలోని యువతను తప్పుదోవ పట్టించే ఒక ఉగ్రవాద గొంతుక ఆగిపోయినట్లయింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి భారీగా ఆయుధ సంపత్తిని స్వాధీనం చేసుకున్నారు. రెండు ఏకే47 రైఫిళ్లు, పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి, గ్రెనేడ్లు, ఇతర యుద్ధ పరికరాలను చూస్తుంటే, ఉగ్రవాదులు ఏదో పెద్ద కుట్రకు ప్లాన్ చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ ఆయుధాలు పాకిస్థాన్ నుంచి అక్రమ మార్గాల్లో వచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న సామాగ్రిని పరిశీలిస్తే, వారు దీర్ఘకాలం కొండల్లో తలదాచుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ను మరింత ముమ్మరం చేశాయి. కొండ ప్రాంతాల్లో ఇంకా ఎవరైనా ఉగ్రవాదులు నక్కి ఉన్నారేమోనన్న అనుమానంతో డ్రోన్ల సాయంతో గాలింపు చేపడుతున్నారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మీ హెచ్చరించింది. జమ్మూ కాశ్మీర్ పోలీసులు ఈ విజయాన్ని ఒక కీలక మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా కిష్త్వాడ్ వంటి వ్యూహాత్మక ప్రాంతంలో ఉగ్రవాద కమాండర్ హతం కావడం వల్ల స్థానిక నెట్‌వర్క్ కుదేలవుతుందని భావిస్తున్నారు. సరిహద్దుల గుండా చొరబాట్లను అరికట్టడంతో పాటు, లోపల ఉన్న ఉగ్రవాదులను వెలికి తీయడంలో సైన్యం అనుసరిస్తున్న కొత్త వ్యూహాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 'ఆపరేషన్ త్రాషి1' సక్సెస్ తో భద్రతా బలగాల నైతిక బలం మరింత పెరిగింది.

నేటి తరం యువతకు, దేశప్రజలకు ఈ విజయం ఒక భరోసానిస్తోంది. సరిహద్దుల్లో శాంతిని కాపాడేందుకు జవాన్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్న తీరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శాంతికి విఘాతం కలిగించే శక్తులకు భారత గడ్డపై చోటు లేదని ఈ ఎన్‌కౌంటర్ మరోసారి నిరూపించింది. ఉగ్రవాదుల ఏరివేతలో ఏమాత్రం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ఈ ఎన్‌కౌంటర్ తర్వాత లోయలో భద్రతను మరింత కఠినతరం చేశారు. ముఖ్యమైన రహదారులు, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఇంటర్నెట్ సేవలపై కొన్ని ఆంక్షలు విధిస్తూనే, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉగ్రవాదుల అంతిమ యాత్రల పేరుతో అశాంతిని రేపేందుకు ప్రయత్నించే శక్తులపై పోలీసులు డేగ కన్ను వేశారు. శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి, సైఫుల్లా వంటి ఉగ్రవాది ముగింపు జమ్మూ కాశ్మీర్ లో సాధారణ స్థితిని నెలకొల్పేందుకు మరింత దోహదపడనుంది. దోడా, కిష్త్వాడ్ ప్రజలు ఇప్పుడు మరింత ధైర్యంగా ఉండే వాతావరణం కనిపిస్తోంది. సైన్యం చేస్తున్న ఈ నిరంతర పోరాటం వల్ల లోయలో ఉగ్రవాదం చివరి దశకు చేరుకుందనే ఆశలు చిగురిస్తున్నాయి. దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వీర జవాన్ల పోరాట పటిమను ప్రతి భారతీయుడు కొనియాడుతున్నాడు.

# బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

శాంతిభద్రతల సాకుతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న తమ గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ శ్రేణులు మండిపడుతున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా భూముల కేటాయింపులు, ఆక్రమణల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. శనివారం సాయంత్రం కాంగ్రెస్ నేతల కార్లపై బీజేపీ కార్యకర్తలు దాడులు చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. ఈ ఘటనతో రెండు పార్టీల కేడర్ల మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు, వాస్తవాలను పరిశీలించేందుకు రామచంద్రరావు కామారెడ్డి పర్యటనకు సిద్ధమయ్యారు. అయితే ఆయన అక్కడికి చేరుకుంటే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఆయనను ఇంటి నుంచి కదలనివ్వకుండా అడ్డుకున్నారు. రామచంద్రరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న వార్త దావానలంలా వ్యాపించడంతో హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను గళమెత్తారు. "మేము ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తుంటే, పోలీసులు కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తల్లా పనిచేస్తున్నారని" రామచంద్రరావు తీవ్రంగా విమర్శించారు. శిశుమందిర్ భూ వ్యవహారంలో తమ ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని, కావాలనే బురద చల్లుతున్నారని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు కుమ్మక్కై బీజేపీ ఎమ్మెల్యేపై దాడికి కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు.

అధికార మదంతో కాంగ్రెస్ నేతలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, తాము కూడా త్వరలోనే అధికారంలోకి వస్తామని, అప్పుడు లెక్కలు సరిచేస్తామని రామచంద్రరావు హెచ్చరించారు. పోలీసులు తనను గృహ నిర్బంధం చేసినంత మాత్రాన తన పర్యటన ఆగిపోదని, ఎప్పుడైనా సరే కామారెడ్డికి వెళ్లి తీరుతానని సవాలు విసిరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రతిపక్ష నేతలను ఇళ్లకే పరిమితం చేయడం



సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అక్రమ అరెస్టులకు తెరలేపుతున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఈ పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో ప్రస్తుతం రౌడీ రాజ్యం నడుస్తోందని, ప్రశ్నించే వారిపై భౌతిక దాడులకు దిగడం హేయమని ధ్వజమెత్తారు. గతంలో ఎమర్జెన్సీ రోజుల్లో ఎలాంటి పరిస్థితులు ఉండేవో, ఇప్పుడు తెలంగాణలో అచ్చం అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి చేస్తున్న అరాచకాలను బీజేపీ కార్యకర్తలు ధీటుగా ఎదుర్కొంటారని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బండి సంజయ్ ఆరోపించారు. తమ నేతలు ఆత్మరక్షణ కోసం ప్రయత్నిస్తుంటే, వారిపైనే తిరిగి దాడులు చేయడం, కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. బాన్సువాడలో సుమారు 70 మంది బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఒక పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలతో ప్రతిపక్షాన్ని అణిచివేయలేదని, ప్రజాక్షేత్రంలో వీటికి సమాధానం చెబుతామని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఈ గొడవలు చర్చనీయాంశంగా మారగా, కామారెడ్డిలోని సామాన్య ప్రజలు మాత్రం తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాజకీయ పార్టీల మధ్య మొదలైన ఈ చిచ్చు ఎక్కడికి దారితీస్తుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. భూ వివాదాల నేపథ్యంలో మొదలైన ఈ పోరు ఇప్పుడు వ్యక్తిగత దూషణలు, భౌతిక దాడుల వరకు వెళ్లడం విచారకరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీల మధ్య సమన్వయం లోపించడం, పోలీసుల ఓవర్ యాక్షన్ వల్ల పరిస్థితి మరింత జటిలమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కామారెడ్డిలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సెక్షన్ 144 అమలులో ఉండటంతో ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడకుండా ఆంక్షలు విధించారు. కాంగ్రెస్ నేతలు కూడా బీజేపీ ఆరోపణలను తిప్పికొడుతూ క్షేత్రస్థాయిలో తమ పట్టు నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీరు వల్లనే ఈ సమస్య ఉత్పన్నమైందని వారు వాదిస్తున్నారు. భూముల రక్షణ కోసం తాము పోరాడుతుంటే బీజేపీ నేతలు కావాలనే శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ ఎత్తుగడలు, పైచేయి సాధించాలనే తపనతో రెండు ప్రధాన పార్టీలు ఒకరిపై ఒకరు కత్తులు నూరుతుండటంతో కామారెడ్డి రాజకీయం హాట్ టాపిక్ అయింది. రామచంద్రరావు అరెస్టు తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. బీజేపీ హైకమాండ్ కూడా ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చే అవకాశం ఉంది. మొత్తానికి కామారెడ్డి భూముల పంచాయితీ ఇప్పుడు హైదరాబాద్ వరకు పాకి తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెంచింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం కంటే చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. అటు బీజేపీ కూడా తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో రానున్న రోజుల్లో కామారెడ్డిలో ఈ రాజకీయ యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చేలా కనిపిస్తోంది.

# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే



**నిజామాబాద్, విశాలభారతి:** ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే శ్రీ ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మన్ కీ బాత్" అంటే దేశ ప్రజలతో ప్రధాన మంత్రి గారి ప్రత్యక్ష సంభాషణ వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ అభివృద్ధి, సాంకేతిక పురోగతి, యువతలో స్ఫూర్తి, రైతుల సాధనలు, క్రీడా రంగ విజయాలు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ వంటి అనేక అంశాలపై అవగాహన కలుగుతుంది అని పేర్కొన్నారు. ప్రత్యేకంగా గ్లోబల్ AI ఇంపాక్ట్ సమ్మిట్ విజయాన్ని ప్రస్తావిస్తూ, భారతదేశం సాంకేతిక రంగంలో ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిందన్నారు. ఏఐ ద్వారా జంతువులకు వైద్యం, రైతులకు, పశుసంవర్ధక రంగానికి అందుతున్న సేవలు మరియు ప్రాచీన భారతీయ గ్రంథాలను ఆధునిక సాంకేతికతతో సంరక్షిస్తున్న విధానం దేశ గౌరవాన్ని పెంచుతోందని అభిప్రాయపడ్డారు. అవయవ దానం గురించి ప్రధాన మంత్రి గారు ప్రస్తావించిన విషయాలను ఎమ్మెల్యే గుర్తు చేస్తూ, అవయవ దానం మహోన్నత సేవ అని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. 10 నెలల వయసు గల చిన్నారి అలిన్ చేరిన్ అబ్రహం హఠాత్తుగా మృతి చెందినప్పటికీ వారి తల్లిదండ్రులు అరుణ్ అబ్రహం, శరీన్ అబ్రహంలు ఎంతో మనోధైర్యంతో తమ కూతురి యొక్క అవయవాలను దానం చేయడం వారి మానవత్వానికి నిదర్శనమని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమంలో ప్రస్తావించడం జరిగిందని అన్నారు. డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, కేవైసీ ప్రక్రియలను అధికారిక మార్గాల్లోనే పూర్తి చేయాలని ప్రజలకు సూచించారు. "వోకల్ ఫర్ లోకల్" సందేశాన్ని అందరూ ఆచరణలో పెట్టాలని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గారు కోరారు. రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, జిల్లా పదాధికారులు, నాయకులు, బూత్ అధ్యక్షులు, కామారెడ్డి జిల్లా ప్రభారి విక్రం రెడ్డి, యువ మోర్చా ప్రతినిధులు, మహిళా మోర్చా సభ్యులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన్య సీమ పరిరక్షణ సమితి గ్రామ కమిటీ ఎన్నిక

**మండల ఇన్చార్జిగా కురుసం కృష్ణమూర్తి నియామకం**



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పేరూరు గ్రామపంచాయతీలో మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య ఆధ్వర్యంలో పేరూరు గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ అధ్యక్షులుగా కోరం గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా తల్లడి శ్రీకాంత్, కార్యదర్శులుగా ఎంజా శ్రీనివాస్, కురుసం ప్రకాష్ తౌర్రెం సాగర్, శ్రీ వేణు, లక్ష్మీనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా వాజేడు మండల మన్య సీమ పరిరక్షణ సమితి ఇన్చార్జిగా కురుసం కృష్ణమూర్తిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సోలం సౌమ్య, జిల్లా నాయకులు తాటి నాగరాజు, మండల నాయకులు కురుసం ప్రసాదు, ఎంజా అనిల్ కుమార్, కురుసం రాంబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

- **అకాల మరణం బాధాకరం**
- **కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా ఈదుల పూసంపల్లి గ్రామంలో ఉపాధ్యాయుడు హలవత్ శంకర్ నాయక్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి చేరుకున్ని, శంకర్ నాయక్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన సత్యవతి రాథోడ్, ఈ దుర్ఘటన కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా ఎన్నో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన శంకర్ నాయక్ సేవలు గ్రామానికి ఎంతో విలువైనవని అన్నారు. సమాజానికి అంకితభావంతో పనిచేసిన వ్యక్తి ఇలా అకాలంగా దూరమవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టసమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి అవసరమైన సహాయం అందించేందుకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శంకర్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ సర్పంచ్ నెహ్రూ నాయక్, బిచ్చు, హలవత్ శంకర్, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## మానవత్వాన్ని చాటిన సర్పంచ్ సంధ్యారాణి

**రూ.5,000 ఆర్థిక సహాయం అందజేత**



**వలిగొండ , విశాలభారతి:** సుంకిశాల గ్రామానికి చెందిన ర్లపల్లి నర్సమ్మఅనారోగ్యంతో ఈ రోజు మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శ్రీమతి పైళ్ల సంధ్యారాణి గారు మరియు ఉపేందర్ రెడ్డి నర్సమ్మ పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నర్సమ్మ మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారులు స్వామి, రాములుకి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నర్సమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంగ బాలయ్య, కొండే కిష్టయ్య, పోలేపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం

**కాంగ్రెస్ నేత నీరజా రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం**



**వలిగొండ , విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవిని జిల్లా కాంగ్రెస్ పార్టీ సహాయ కార్యదర్శి నీరజా రెడ్డి వెంకటేశ్వర్ల రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి పంపుల రాములు గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె. రసూల్ పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి ప్రజల అభివృద్ధికి కృషి చేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసింహస్వామి దేవస్థానంను దర్శించుకున్న వెంకటేష్ దంపతులు





**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంను ఓ న్యూస్ ఛానల్ సీఈఓ కడకంచి వెంకటేష్ తన దంపతులతో కలిసి ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న పవిత్ర చేపలను దర్శించిన అనంతరం కడకంచి వెంకటేష్ మాట్లాడుతూ, మత్స్యగిరి క్షేత్రంలో కనిపించే చేపలకు సహజసిద్ధంగా నామాలు ఉండడం చాలా విశేషమని తెలిపారు. స్వామివారి మహిమతో ఈ చేపలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తాయని, లక్ష్మీనరసింహ స్వామి వారి కృపతో ఈ క్షేత్రం ఎంతో పవిత్రంగా నిలుస్తోందని అన్నారు. వలిగొండ మండల రిపోర్టర్ మల్లేష్ గౌడ్ గారు సీఈఓ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్‌కు సన్మానం




**కేశంపేట,విశాలభారతి:** షాద్ నగర్ మున్సిపల్ నూతన వైస్ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ను కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కేశంపేట మండల కేంద్రం నుండి షాద్ నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీస కరుణాకర్ రెడ్డి, బోధునంపల్లి సర్పంచ్ ఎదిరే నాగేష్ లు జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సన్మానం చేసి అందె మోహన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మంచి ఉన్నత స్థానంలో ఉండాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ అవ రాగవేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు వట్టెల లింగం, అకిల్, ఆనంద్ రెడ్డి, రాజేష్, మల్లేష్, భీమయ్య, శ్రీకాంత్, రాంరెడ్డి, మహేష్, ధరమోని రాజేష్, చింటూ, సందేశ్, దర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పకడ్బందీ విద్యా అమలు

**రెగిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశి రామ్ నాయక్**



**మహబూబాబాద్ , విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పకడ్బందీ విద్యా ప్రణాళిక అమలు కొనసాగుతోంది. నూతన సాంకేతికతతో కూడిన డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన పద్ధతులను ప్రవేశపెట్టి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టారు. ఆదివారం మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీ రామ్ నాయక్ సందర్శించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, వసతి, ఆహార నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డిపిఆర్ఓ, ప్రిన్సిపల్ మరియు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలో సమగ్ర ప్రణాళికతో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 6 వసతి గృహాలు, 9 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 104 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 7,044 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. పదో తరగతిలో 881 మంది విద్యార్థులు ఉండగా వారికి ప్రత్యేక దృష్టితో అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక డైట్ మెనూ అమలు చేస్తున్నారు. ఉదయం బూస్ట్, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం షెడ్యూల్ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారు. వారానికి మటన్, చికెన్, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారం అందజేస్తున్నారు. ప్రతి నాలుగు హాస్టళ్లకు ఒక అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నియామకం చేసి పర్యవేక్షణ చేపడుతున్నారు. అదనంగా వైద్య పరీక్షలు, మానసిక దృఢత్వం కోసం ప్రత్యేక మార్గదర్శక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ బానోతు శుక్రు నాయక్ మరియు స్టడీ అవర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## ఘనంగా కందాల రంగారెడ్డి 41వ వర్ధంతి



**చౌటుప్పల, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో కందాల రంగారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు ఆధ్వర్యంలో స్తూపానికి పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జాంగిర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ మాట్లాడుతూ..గత 41సంవత్సరాల క్రితం ఎర్రజెండా ముద్దుబిడ్డ కందాల రంగారెడ్డి ని కాంగ్రెస్ గుండాలు హతమార్చారని, ఎక్కడ కూడా పార్టీ శ్రేణులు బెదరకుండా రంగారెడ్డి వారసత్వంతో నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పట్ల నిక్కచ్చిగా పోరాడేది ఒక్క సిపిఎం పార్టీనే అని అన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా పార్టీ అభివృద్ధి కోసం మొక్కవని దీక్షతో ఈ మండలంలో సిపిఎం పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. నేటి కార్పొరేట్ రాజకీయాలలో పుటకో పార్టీ మారే కాలంలో ప్రజా సమస్యల కోసం నిక్కచ్చిగా నిలబడేది కమ్యూనిస్టులని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది. కాంగ్రెస్ రాష్ట్రప్రభుత్వం షరతులు లేకుండా 6 గారంటీలను అమలు చేయాలని అన్నారు. వచ్చేది వేసవికాలం కాబట్టి ప్రజలకు నీటి ఎద్దడి సమస్య రాకుండా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు అందరూ కూడా కందల రంగారెడ్డి స్థూపానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జి.శ్రీనివాస చారి, ఎండి పాషా, రాగిరు కిష్టయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, తడక మోహన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, పొట్ట శ్రీను, ఆదిమూల నందీశ్వర్, కొండే శ్రీశైలం, కొంతం సుశీల, మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపనబోని లక్ష్మణ్, మాజీ సర్పంచ్ భీమిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కందాల రవీందర్ రెడ్డి, చీరిక అలివేలు, కడగంచి రాజు, పల్లె జంగయ్య, రత్నం, శ్రీకాంత్, నేరేడు మహేష్, గుండ్ల మహేష్, బాలగోని బాలరాజు, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్, ఎండి షబీర్, జంగం అంజయ్య, ఆకుల ధర్మయ్య, సబ్సిడీ శ్రీనివాస్ రెడ్డి, కలకుంట్ల శివ, భావడ్లపల్లి స్వామి, యాట బాలరాజు, చింతకింది పాండు, గండని లక్ష్మీపతి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో వృద్ధుడు మిస్సింగ్

**కుటుంబ కలహాల అనంతరం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో వృద్ధుడు అనుమానాస్పద పరిస్థితుల్లో కనిపించకుండా పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 22, 2026న మధ్యాహ్నం 12:30 గంటలకు బండ్లగూడ, నాగోల్ ప్రాంతానికి చెందిన కళ్లేపల్లి స్వప్న (38) ఫిర్యాదు చేశారు. ఆమె తండ్రి అనుగుల జయప్రకాశ్ రెడ్డి (70), జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందినవారు. ఫిబ్రవరి 21 ఉదయం ఇంటి పనుల విషయంలో భార్యతో స్వల్ప వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. వాగ్వాదం అనంతరం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో "ఇంట్లో భార్య ఒక్కరే ఉండాలి" అంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన జయప్రకాశ్ రెడ్డి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఆయన ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు ఆయన తెలుపు రంగు చొక్కా, కాఫీ రంగు ప్యాంట్ ధరించి ఉన్నారని, సుమారు 5 అడుగుల ఎత్తు, తెల్లని వర్ణం కలవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా, తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లడం గమనార్హం. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

## పసిబిడ్డ మరణానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

**రజక సంఘం యువనాయకుడు కల్వకోలు తిరుపతి**



**కేశంపేట,విశాలభారతి:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో నిరుపేద రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మరణించడం అమానుషమని, చిన్నారి మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రజక సంఘం యువ నాయకుడు కల్వకోలు తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రజక సామాజిక వర్గానికి చెందిన సి.చంద్రకళ కుటుంబం బుధవారం కుమ్మెర మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం కోసం వెళ్లగా, ఆలయంలో కొంతమంది కులం కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని ఈ దాడిలో గాయపడిన పాప చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని తెలిపారు. ఈ పనికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాజన్న బరోసా పథకం కింద రూ.51,000 ఆర్థిక సాయం

**మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు చెక్కు అందజేత**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు ఆధ్వర్యంలో రాజన్న బరోసా పథకం కింద ఆర్థిక సహాయం అందజేశారు. చిలుకూరు స్థానిక ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాజన్న భరోసా ద్వారా మంగలి శాంతమ్మ రెండో కుమార్తెకు అక్షరాల రూ.51,000 చెక్కును ఈ రోజు అందించారు. ఈ సందర్భంగా గరుగు రాజు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాజన్న బరోసా పథకం ద్వారా అవసరమైన కుటుంబాలకు నిరంతరం సహాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామ ప్రజలు ఈ సహాయంపై హర్షం వ్యక్తం చేస్తూ, సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న నాయకత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితులని కఠినంగా శిక్షించాలి

**తిరుమలగిరి,విశాలభారతి :** తిరుమలగిరి మండల రజక సంఘం ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ లో రజకులపై జరిగిన దాడి ఖండిస్తూ తిరుమలగిరి చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్నారి మరణానికి కారణమైన అగ్రకుల వర్ణ వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షులు పులిమామిడి సోమన్న, ఉపాధ్యక్షులు ఓడపల్లి సోమనసయ్య, ప్రధాన కార్యదర్శి వెంకన్న, కోశాధికారి వెంకన్న, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కందుకూరి ప్రవీణ్, పరశురాములు, విప్లవ్ కుమార్, వెంకన్న, రమేషు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- **వృద్ధురాలికి పదివేల రూపాయలు జీవితాంతం పంపిస్తానని హామీ**
- **మరో మహిళకు 2 లక్షల ఇస్తానని హామీ**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలి ఒక్కగానొక్క కుమారుడు ఇటీవల మరణించాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాచర్ల సంతోష్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆ వృద్ధురాలికి పరామర్శించి ఆమె బతికివున్నంత కాలం పదివేల రూపాయలు పంపిస్తానని హామీ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పించాడు. మరియు స్థానిక మహిళ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకొని వారికి కుటుంబానికి రెండు లక్షలు రూపాయలను ఆర్థిక సాయం అందజేస్తారని హామీ ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. మహిళల పట్ల ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దాతృత్వం చూసి స్థానికులు హర్ష వ్యక్తం చేశారు.

## ముదిరాజ్ కమ్యూనిటీ నూతన భవనం ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ లో ముదిరాజ్ కమ్యూనిటీ నూతన భవనాన్ని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాష్ లతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో ప్రతి వర్గానికి ప్రభుత్వం ద్వారా కమ్యూనిటీ భవనాలు కేటాయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ భవనాలు బీసీల ఐక్యతకు దోహదపడతాయని అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరగాలని, వెనుకబడిన కులాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ భవనాలు ఉపయోగపడాలని పేర్కొన్నారు. ప్రతి పేదింటికి శుభకార్యాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ భవనాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు, స్థానిక పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి సీఎం నివాళులు

**మొదటిపేజీ తరువాయి**

కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌పై ఆగ్రహం

- మధు పార్క్ రిడ్జ్ వాసులకు అండగా హరీష్ రావు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** మాజీ మంత్రి హరీష్‌రావు మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ వాసులకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని బండ్లగూడ పరిధిలో ఉన్న మధు పార్క్ రిడ్జ్ గేటెడ్ కమ్యూనిటీ వాసులను ఆయన ఈరోజు కలిసి వారికి భరోసా కల్పించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం జారీ చేసిన నోటీసులపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి తదితరులతో కలిసి అపార్ట్మెంట్ వాసులతో సమావేశమై మనోధైర్యం నింపారు.

హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నదని విమర్శించారు. గాంధీ సరోవర్ పేరుతో ప్రజల ఇళ్లను స్వాధీనం చేసుకోవడం సరికాదని, వెంటనే నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిహారం కింద ఇచ్చే టిడిఆర్ లేదా డబ్బులు అవసరం లేదని, ఇళ్లను కూల్చివేసి విగ్రహం ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. గాంధీ విగ్రహానికి తాము వ్యతిరేకం కాదని, కానీ మధ్యతరగతి ప్రజలు లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇళ్లను తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఖాళీ ప్రదేశాలు ఉన్నాయని, అక్కడే విగ్రహం ఏర్పాటు చేయవచ్చని సూచించారు. అవసరమైతే హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ వరకు వెళ్లేందుకు సిద్ధమని, మధు పార్క్ రిడ్జ్ వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇక్కడి ప్రజలకు మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావుతో మంచి అనుబంధం ఉందని, ఆయనను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలంతా ఐక్యంగా పోరాటం చేయాలని హరీష్ రావు కోరారు. నోటీసుల కారణంగా ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అపార్ట్మెంట్ నుంచి కొంతమంది ప్రతినిధులు కలిసి కార్యాచరణపై చర్చించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ లతా ప్రేమ్ గౌడ్, రావు కొండల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


## విప్లవాత్మక ఉద్యమాల జ్ఞాపకం

- సిపిఎం ఆధ్వర్యంలో పాకలపాటి వసంతరావు 4వ వర్ధంతి సభ
- సిపిఎం పట్టణ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి సభ
- పార్టీ నిర్మాణంలో పాకలపాటి వసంతరావు కీలక పాత్ర
- ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్న నాయకుల పిలుపు



**సత్తుపల్లి, విశాలభారతి :** సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాకలపాటి వసంతరావు నాలుగో వర్ధంతి సభను సత్తుపల్లి పట్టణ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాకలపాటి వసంతరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు, జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ, పాకలపాటి వసంతరావు సత్తుపల్లి పట్టణంలో పార్టీని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేశారు. పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా కష్టజీవుల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించడంలో ఆయన కీలక భూమిక పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాకలపాటి మల్లికార్జున్, పాకలపాటి శ్రీనివాసరావు, పాకలపాటి ఝాన్సీ, జాజిరి జ్యోతి, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, బడే మియా వెంకటేశ్వరరావు, జిలాని, బెజవాడ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరావు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ డిజిటల్ పరీక్షకు విశేష స్పందన



**పాల్వంచ విశాల భారతి:** స్థానిక మున్సిపల్ పరిధి లోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెల్ఫ్ అసెస్మెంట్ డిజిటల్ పరీక్షకు, తమ ఉజ్వల భవిష్యత్ లక్ష్యాల దిశగా అడుగులు వేస్తున్న అభ్యాసకుల నుండి విశేష స్పందన లభించింది. పరీక్షా నిర్వహణ తీరును టాస్ అబ్జర్వర్ ఎస్.కె ఖాసీం పాషా పరిశీలించారు. పరీక్ష అనంతరం అభ్యాసకులకు వార్షిక పరీక్షలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయడానికి కావాల్సిన విలువైన సలహాలు, సూచనలను అభ్యాసకులకు అందించారు. ఈ సందర్భంగా అభ్యాసకులు మాట్లాడుతూ, సెల్ఫ్ అసెస్మెంట్ డిజిటల్ పరీక్ష తో తమకున్న పరీక్షా భయం తొలగిపోయిందని , వార్షిక పరీక్షలకు ముందు ఇదొక 'వార్మప్' సెషన్‌లా ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఏ.ఐ కోఆర్డినేటర్ జి. భాస్కర్ రావు, పాఠశాల సిబ్బంది కె. మహేశ్వరి మరియు అభ్యాసకులు పాల్గొన్నారు.

## కుటుంబాన్ని పరామర్శించిన విప్ డా. రాంచందర్ నాయక్

**బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందిస్తాం: విప్ హామీ**



**మహబూబాబాద్ , విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కోటియా తండా గ్రామపంచాయతీకి చెందిన తేజావత్ హేమ నాయక్ (65) పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం అత్యంత విషాదకరమని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డా. రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆయన మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుడి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని రకాల ఆర్థిక సహాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వెంటనే స్పందించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రైతులు, వ్యవసాయ కూలీలు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని విప్ డా. రాంచందర్ నాయక్ భరోసా ఇచ్చారు.

## ఘనంగా తారమతి పేట్‌లో మహంకాళమ్మ జాతర ఉత్సవాలు

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్ హాజరు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** కుంట్లూర్ డివిజన్ (51) పరిధిలోని తారమతి పేట్ గ్రామంలో ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీశ్రీశ్రీ మతా మహంకాళమ్మ జాతరను ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది . మూడు రోజులపాటు జరుగుతున్న జాతర కార్యక్రమాలు గ్రామాన్ని పండుగ వాతావరణంలో ముంచెత్తాయి.ఈ జాతర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరయ్యారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ఆశీస్సులు పొందారు. జాతరలో భాగంగా నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళ్యాణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామ దేవతల జాతరలు మన సంప్రదాయాల పరిరక్షణకు, గ్రామ ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు. తారమతి పేట్ గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## మర్రిపల్లిలో బీజేపీ జెండా ఆవిష్కరణ



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మర్రిపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. బూత్ అధ్యక్షుడు శ్రీశైలం , పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు హాజరై కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల్లో పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. పెద్ద అంబర్‌పేట్ గడ్డపై బీజేపీ విజయానికి పునాది మర్రిపల్లి నుంచే పడాలి. కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి ప్రజల మద్దతు పొందాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని జై భారత్ - జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాన్ని హోరెత్తించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మద్ది సిద్ధార్ రెడ్డి, పిల్లి శ్రీనివాస్ యాదవ్, చరణ్ రెడ్డి, మద్ది శ్రీకాంత్ రెడ్డి, గూడెపు మధు గౌడ్ , రాజు సెంట్పాల్ (బీజేపీ 52వ డివిజన్ వైస్ ప్రెసిడెంట్), కట్ట సాయి కిరణ్ గౌడ్, నరేష్, శ్రీహరి, వేమన (గౌరెల్లి గ్రామ బీజేపీ అధ్యక్షుడు), నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న స్వామి బోనాలు



**చేవెళ్ల, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా పరిధిలోని షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి భక్తుల నినాదాలతో మారుమోగింది.ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల బోనాలను అలంకరించి స్వామివారికి సమర్పించేందుకు సిద్ధమయ్యారు. డప్పుల మోగింపు, జానపద గీతాల మధ్య పోతురాజుల ఉత్సాహభరిత విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధుల గుండా శోభాయాత్రగా సాగిన బోనాల ఊరేగింపు ఆలయానికి చేరుకున్న తర్వాత భక్తులు మల్లన్న స్వామివారికి బోనాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ అభివృద్ధి, కుటుంబాల ఆయురారోగ్యాలు, సౌభాగ్యసంపదల కోసం భక్తులు ప్రార్థనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఏడాది ఇలాగే బోనాల పండుగను ఐకమత్యంతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. యువత కూడా భక్తి భావంతో ముందుకు వచ్చి ఏర్పాట్లలో చురుకుగా పాల్గొనడం ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య, మాజీ సర్పంచులు మద్దూరి శకుంతల, మద్దూరు మల్లయ్య, మాజీ ఎంపీటీసీలు గుత్తి సునీత, మద్దూరి పాండు, సీనియర్ నాయకులు గుత్తి రామస్వామి, ఇతర గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, బంధుమిత్రులు మరియు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొని, సాంప్రదాయ సంస్కృతి ప్రతిబింబించిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.

## బండరావిరాలలో అభివృద్ధి దిశగా వేగవంతమైన అడుగులు



**గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ 60 రోజుల పాలనపై సమగ్ర ప్రగతి నివేదిక**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం బండరావిరాల గ్రామంలో అభివృద్ధి పనులకు సరికొత్త ఊపు వచ్చింది. గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కందికంటి విజయ్ కుమార్ తో పాటు నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టి నేటికి 60 రోజులు పూర్తయ్యాయి. గత ఏడాది డిసెంబర్ 22న బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన కార్యక్రమాలపై సర్పంచ్ సమగ్ర నివేదిక విడుదల చేశారు. పదవి చేపట్టిన వెంటనే వార్డు సభ్యులతో కలిసి "వార్డు బాట" కార్యక్రమం నిర్వహించి, ప్రతి వార్డులో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో పాఠశాల ఆవరణ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. వాటర్ ఫిల్టర్ యూనిట్, డ్వాక్రా భవనం, పంచాయతీ కార్యాలయాలను పాఠశాల పరిధి నుండి వేరు చేసి విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యపై జిల్లా విద్యాశాఖాధికారిని స్వయంగా కలిసి పరిష్కారం కోరినట్లు తెలిపారు.

గ్రామంలోని 3, 7, 8, 9 వార్డులలో "గుండోజి రంగదాసు" పేరుతో ఉచిత ట్యూషన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు. ట్యూషన్ టీచర్లకు వార్డు సభ్యులే స్వంత నిధులతో జీతాలు చెల్లించడం విశేషం. కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్‌తో పాటు ఉప సర్పంచ్ దూస శంకర్, వార్డు సభ్యులు గుండ్ల భవానిశివ ముదిరాజ్, నేమురగోముల మహేష్, కన్నె భరత్ యాదవ్, కందికంటి అనూషప్రవీణ్, ఏర్పుల హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శివ భక్తులకి లాఠీ దెబ్బలు,రంజాన్‌కు ముస్లిమ్ ఉద్యోగపనిలో మినహాయింపు




**తీవ్రంగా ఖండిస్తున్నా,తెలంగాణ శివసేన**

**చౌటుప్పల్, విశాల భారతి:** ఉద్ధవ్ బాల సాహెబ్ థాక్రే పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్ మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పక్షములో ఉన్న ప్రభుత్వాలు హిందువులకి పవిత్రమైన దసరా మరియు శివరాత్రి పండగలలో శివ భక్తులపై లాఠీ ప్రయోగించి పోలీస్ బలాన్ని ఉపయోగించిన ఆంధ్ర ప్రభుత్వం రంజాన్ మాసంలో ముస్లిమ్ ఉద్యోగులకు 3 గంటలు పనివేళలు మినహాయింపు అదేవిధముగా తెలంగాణ రాష్ట్రంలో అయ్యప్ప మాల ధరించి విధులకు హాజరైన పోలీస్ కి మెమో ఇవ్వడంపై శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్ తీవ్రంగా మండిపడ్డారు.హిందూ పండగ వేళల్లో రద్దీ పేరుతో బస్సు ప్రయాణ ధరలు పెంచి ముస్లిమ్, క్రిస్టియన్స్ కి ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్న తెలుగు రాష్ట్రాల అధికారక పార్టీల వైఖరిని శివసేన పార్టీ ఖండిస్తుందని తెలియజేసారు.హిందువులను ఓటు బ్యాంకుగా చూస్తూన్న పాలకులకి రాబోవు రోజుల్లో ఓటమి తప్పదని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్ తీవ్రంగా హెచ్చరించారు.ఇకనైనా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ద్వంధ వైఖరి విడనాడాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి మహేష్,రాంపాక కార్యాలయ ప్రాముఖ్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం**

**కూకట్పల్లి విశాలభారతి:** మోమిన్ పేట్ మండలం, అమ్రాది కలాన్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం పై దాడి చేసి ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం పై దాడి చేయడం అంటే రాజ్యాంగం పై దాడి చేయడమే. కొంతమంది ఉన్మాద భావజాలం కలిగిన వాళ్లు ఈ పిరికిపంద చర్యకు పాల్పడ్డారు. దాడులు చేసినంత మాత్రాన అంబేద్కర్ ఆలోచన విధానం ఆగదు. ఈ దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీలు అన్ని రంగాలలో భాగస్వాములు కావడానికి అంబేద్కర్ కారణం. అలాంటి మహనీయుడు పై విషం చిమడం సరైనది కాదు. ఈ దేశానికి అంబేద్కర్ ఆలోచన విధానమే శరణ్యం. కాబట్టి విగ్రహం పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

## ఆధ్యాత్మిక సేవలో భాగంగా రూ.1,50,000 విరాళం అందజేత

- జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచముఖ
- ఆంజనేయ స్వామి దేవాలయానికి ఆర్థిక సహాయం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీ రామా హిల్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ద్వార ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి రూ.1,50,000 విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తవ్వాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి దంపతులు తెలిపారు. అలాగే మహోత్సవానికి విచ్చేసిన భక్తులు కాలనీ వాసుల కోసం ట్రస్ట్ తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. వేడుకలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను ట్రస్ట్ తరపున అభినందిస్తూ, పంచముఖ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'లాకస రెస్టారెంట్ ' ఘనంగా ప్రారంభం

**ముఖ్య అతిథులుగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** చౌటుప్పల్ మండల పరిధిలోని అందోల్ మైసమ్మ దేవాలయం సమీపంలో, అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సుధాకర్ మిత్ర బృందం నూతనంగా ఏర్పాటు చేసిన లాకస రెస్టారెంట్ ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని, ఇటువంటి వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో కొత్త వ్యాపారాల ప్రారంభం ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ఆయన అన్నారు.స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో హాజరై నూతనంగా ప్రారంభమైన లాకస రెస్టారెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## నూకల రంగారావు దంపతులను ఘనసత్కారం

**గద్దల రమేష్ టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్**



**పాల్వంచ, విశాలభారతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ గా నూకల సరిత గెలుపొందిన సందర్భంగా ఆదివారం పాల్వంచ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నూకల రంగారావు దంపతులను ఘనంగా శాలువాలు పుష్పగుచ్ఛాలతో సత్కరించి,అభినందించిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్, దండోరా శ్రీను. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో సాధించిన ఈ విజయం డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని డివిజన్లో మౌలిక వసతులు మరియు పారిశుద్ధ్యం,తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గద్దల రమేష్ తెలిపారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ప్రజాప్రతినిధులు



**ఖమ్మం, విశాలభారతి:** నూతనంగా ఎన్నికైన సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఆదివారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

*నగర రియల్ ఎస్టేట్ రంగం బలంగా దూసుకెళ్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ముంబయి, బెంగళూరు వంటి మెట్రో నగరాల నుంచి పెట్టుబడిదారులు హైదరాబాద్ ప్రాజెక్టులపై ఆసక్తి చూపుతున్నారనే సమాచారం మార్కెట్‌లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండటం సిటీ రియాల్టీ ఉత్సాహాన్ని నీరుగారుస్తుంది. అయితే ఈ ఉత్సాహం స్థిరమైన వృద్ధికా? లేక లగ్జరీ సెగ్మెంట్‌లో కేంద్రీకృతమైన పెట్టుబడుల వల్ల ఏర్పడిన తాత్కాలికమే? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. - హైదరాబాద్, విశాలభారతి*

# స్కోప్ ఉంది.. హోప్ లేదాయే..

## పెట్టుబడిదారుల రాకతో ఉత్సాహం
## కానీ క్షేత్రస్థాయిలో కనిపించని వృద్ధి
## లగ్జరీ సెగ్మెంట్‌కే పరిమితమైతున్న డిమాండ్

ముంబయి, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో చురుకుగా ఆస్తుల కొనుగోలు–అమ్మకాలు చేసే పెట్టుబడిదారులు ఇప్పుడు హైదరాబాద్‌లో బుకింగ్స్ చేస్తున్నారన్నది రంగ వర్గాల అంచనా. ముఖ్యంగా నిర్మాణ దశలోనే బహుళ ఫ్లాట్లు బుక్ చేసి, ప్రాజెక్ట్ పూర్తయ్యాక ప్రీమియంతో విక్రయించే వ్యూహం కనిపిస్తోంది. దీన్ని కొందరు "ఇన్వెస్టర్ డ్రైవన్ మార్కెట్"గా విశ్లేషిస్తున్నారు.



### వెస్ట్ కారిడార్‌కే కేంద్రీకరణ...

కొకాపేట, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ ప్రాంతాల్లో భూమి ధరలు, డిమాండ్ రెండూ పెరిగాయి. భారీ స్థాయి, అల్ట్రా లగ్జరీ ప్రాజెక్టులు, పేరు ఉన్న డెవలపర్లు—ఇవి ఉంటే నిధుల సమీకరణలో ఇబ్బంది లేదని ఈ రంగ కన్సల్టెంట్లు చెబుతున్నారు. పెట్టుబడిదారులు ముందుగానే ప్రవేశించి, బిల్డర్ నిబంధనలకే ఒప్పుకుంటున్నారని సమాచారం. అయితే ఈ కేంద్రీకరణ వల్ల నగరంలోని ఉత్తర, దక్షిణ మండలాలు పెద్దగా కదలికలేకుండా ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. వెస్ట్ హైదరాబాద్‌కే పరిమితమైన డిమాండ్ నగర సమతుల అభివృద్ధిపై ప్రభావం చూపుతుందా? అన్న చర్చ కొనసాగుతోంది.

### ప్రీమియం సెగ్మెంట్ దూసుకెళ్తోంది...మిగతావి?

తాజా రిజిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం ₹1.5 కోట్లు పైబడిన ఇళ్లే లావాదేవీల విలువలో పెద్ద వాటాను ఆక్రమిస్తున్నాయి. ఇది మార్కెట్ ప్రీమియం వైపు మళ్లిందనే సంకేతం. కానీ ఇదే సమయంలో అందుబాటు ధరల గృహాలపై ఆసక్తి తక్కువగా ఉందని రంగ వర్గాలు చెబుతున్నాయి. అంటే మార్కెట్ మొత్తం వేగంగా పరిగెడుతోందా? లేక లగ్జరీ ప్రాజెక్టులే మార్కెట్ను నడిపిస్తుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా తక్కువ ధరల ఉండే ప్రాజెక్టుల సెగ్మెంట్‌లో స్తబ్ధత కొనసాగుతుండగా, అధిక ధరల ప్రాజెక్టులు పెట్టుబడిదారులపై ఆధారపడి ముందుకు సాగుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

### మెట్రో నగరాలతో పోలిక....

"ముంబయి, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం సాచురేటెడ్ స్థాయికి చేరింది. కానీ హైదరాబాద్‌కు ఇంకా విస్తరణ సామర్థ్యం ఉంది" అని కొందరు పెట్టుబడిదారులు చెబుతున్నారు. విస్తృతమైన భూభాగాలు అందుబాటులో ఉండటం, అనుమతులు వేగంగా లభించడం హైదరాబాద్‌కు ప్రయోజనమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే పెట్టుబడులు ప్రధానంగా ధరల పెరుగుదలపై ఆధారపడితే, తాత్కాలిక గ్రోత్ పరిస్థితి తలెత్తే అవకాశాన్ని కొందరు విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. నిర్మాణ దశలోనే బుకింగ్స్ చేసి, పూర్తయ్యాక ప్రీమియంతో విక్రయించడం—ఇది వినియోగదారుల డిమాండ్ కంటే పెట్టుబడిదారుల వ్యూహమే ఎక్కువగా ప్రతిబింబిస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### భవిష్యత్ వృద్ధి... సమతులతే కీలకం

ఉత్తర హైదరాబాద్‌లో భూముల్లో పెట్టుబడులు పెడుతున్నారన్న సమాచారం ఉన్నప్పటికీ, తక్షణ రాబడుల కోసం లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీల్లో పెట్టుబడులు ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నాయి. ఇది మార్కెట్‌ను రెండు ముక్కలుగా విడగొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద నగర రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా మందగించిందనడం అతిశయోక్తి. అదే సమయంలో "బలంగా దూసుకెళ్తోంది" అన్న వాదన కూడా సమగ్రమైన అభిప్రాయం చూపడం లేదు. వాస్తవానికి డిమాండ్ స్పష్టంగా లగ్జరీ సెగ్మెంట్‌కే కేంద్రీకృతమై ఉంది. మధ్యతరగతి, అందుబాటు గృహాల మార్కెట్‌లో మాత్రం ఉత్సాహం పరిమితంగానే కనిపిస్తోంది. హైదరాబాద్‌కు విస్తరణ సామర్థ్యం, పెట్టుబడి ఆకర్షణ ఉంది. కానీ వృద్ధి సమతులంగా అన్ని సెగ్మెంట్లలో విస్తరించకపోతే, దీర్ఘకాలిక స్థిరత్వంపై ఇప్పటికీ ఈ రంగ నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తూనే ఉన్నారు.




## ఫిర్యాదు వచ్చేదాకా రేరా మౌనమేనా?

### అనుమతుల్లేకుండా విక్రయాలు...
### ఆ తర్వాత 'చర్యలు'!
### టీజీ రేరా పనితీరుపై అనుమానాలు

**హైదరాబాద్, విశాలభారతి:**

దొంగలు పడి దోచుకెళ్లిన ఆరు నెలల తర్వాత ఇంటి యజమానులు నెత్తి నోరు మోదుకున్నట్లుగా తెలంగాణ రేరా పనితీరు ఉంది. నగరంలో యదేచ్ఛగా క్రయవిక్రయాలు సాగుతున్న, పట్టించుకోని యంత్రాంగం, కొనుగోలుదారులు నిండా మునిగిన తర్వాత ఆదుకున్నట్లుగా వ్యవహరిస్తుంది. రేరా అనుమతులు లేకుండానే ప్రాజెక్టుల్లో ఫ్లాట్ల విక్రయాలు యథేచ్ఛగా సాగుతాయి. చెప్పేది ఒకటి... విక్రయించేది మరోటి. బ్రోచర్లు, ప్రకటనల్లో చూపేది ఒక ప్లాన్ అయితే, అమలు తీరు వేరేలా ఉంటుందన్న ఆరోపణలు ఉంటాయి. కానీ కొనుగోలుదారులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేసేంత వరకు అధికార యంత్రాంగం కదలిక కనిపించదన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం, 2016 ప్రకారం రేరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాజెక్ట్ లేదా దానిలో బ్లాకుల ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలు చేయరాదు. ఉల్లంఘనలు నిరూపితమైతే భారీ జరిమానాలు, తదుపరి శిక్షలు విధించే అవకాశం ఉంది. అయినప్పటికీ, ముందస్తు తనిఖీలు, సుమోటో చర్యలు కనిపించకపోవడం వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తేలిపోతుంది.

**"ఫిర్యాదు వచ్చిన తర్వాతే స్పందన...**

అంతవరకు నిర్లక్ష్యం అన్న అభిప్రాయం రియల్ ఎస్టేట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ యంత్రాంగం బలహీనంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతోనే కొనుగోలుదారులు లక్షల కుమ్మరించి బిల్డర్ల జేబులు నింపుతున్నారు. కనీసం కొనుగోలుదారులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో కొందరు బిల్డర్లు రెచ్చిపోతున్నారు. అందిన కాడికి దోచుకుంటూ, కొనుగోలుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. కానీ రేరా మాత్రం కొనుగోలుదారులు ఫిర్యాదు చేస్తే గాని పట్టించుకునే పరిస్థితి లేదు.

**కొనుగోలుదారులే చివరకు ఫిర్యాదుదారులు...**

నిజానికి కొనుగోలుదారులకు మోసపోకుండా ముందే రక్షణ కల్పించాలని రేరా చర్యలు... లేకపోవడంతో కొనుగోలుదారులే చివరకు ఫిర్యాదుదారుల అవతారం ఎత్తాల్సిన దుస్థితి వచ్చింది. అడ్వాన్స్‌లు చెల్లించి, బ్యాంకు రుణాలు తీసుకుని ఈఎంఐలు చెల్లిస్తున్న వారు సమస్యలు ఎదురైన తర్వాతే ఫిర్యాదులు చేసుకోవాల్సి వస్తోంది. ఈలోపు విక్రయాలు సాగిపోతున్నాయి.

ప్రణిత్ కాన్సెప్ట్స్ కేసు... తాజా ఉదాహరణ

ఇటీవల నగరంలోని ఒక ప్రాజెక్ట్ విషయంలో వచ్చిన ఫిర్యాదులపై టీజీ రేరా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత ప్రొమోటర్ Pranith Koncepts Pvt. Ltd. చేపట్టిన 'ప్రణిత్ కాన్సెప్ట్స్ అంబియెన్స్' ప్రాజెక్ట్‌లో రేరా రిజిస్ట్రేషన్ ఉన్న బ్లాకులు, లేని బ్లాకుల మధ్య తేడా ఉన్నప్పటికీ విక్రయాలు జరిగాయన్న ఆరోపణలపై చర్యలకు ఆదేశించింది. ఈ ఘటన జరిగి ఏడాది గడుస్తున్న, అంతకు ముందు నుంచే ఈ సంస్థ రేరా నమోదు లేకుండానే ప్రాజెక్టులోని ఇతర బ్లాకులను అమ్మి సొమ్ము చేసుకుంది. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా, రేరా అనుమతులు ఉన్న మూడు బ్లాకులను కొనుగోలుదారులకు చూపెట్టి అందిన కాడికి జేబుల్లో వేసుకున్నారు. చివరకు మోసపోయామని రేరా గడప దక్కడంతో ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారు. రేరా రిజిస్ట్రేషన్ కొన్ని బ్లాకులకు మాత్రమే తీసుకుని, ఇతర బ్లాకుల్లో ప్రకటనలు, విక్రయాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో టీజీ రేరా ఆ బ్లాకుల్లో విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించి, సెక్షన్ 59 కింద జరిమానా ప్రక్రియలు ప్రారంభించాలని సూచించింది. అలాగే నిర్మాణ పురోగతి నివేదికలు, నిధుల వినియోగ వివరాలు సమర్పించాలని ప్రొమోటర్‌ను ఆదేశించింది.

**నియంత్రణ చర్యలు ఎప్పుడు?**

ఈ కేసు నేపథ్యంలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న — ఫిర్యాదు వచ్చేదాకా విక్రయాలు కొనసాగితే, చట్టం ఉద్దేశించిన 'నియంత్రణ వ్యవస్థ' ఎక్కడ? ముందస్తు తనిఖీలు, ప్రకటనల పరిశీలన, రెరా రిజిస్ట్రేషన్ స్థితిపై క్రమం తప్పని తనిఖీలు ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.జరిమానా ప్రక్రియలు ప్రారంభించడం మాత్రమే సరిపోదని, వసూలైన మొత్తాల భద్రత, నిర్మాణ సమయ పట్టిక అమలు, కొనుగోలుదారుల అసోసియేషన్ ఏర్పాటు వంటి అంశాల్లో కఠిన పర్యవేక్షణ అవసరమని కొనుగోలుదారుల వర్గాలు సూచిస్తున్నాయి. రేరా వ్యవస్థ ఏర్పాటుకు ప్రధాన లక్ష్యం పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ, గృహ కొనుగోలుదారుల రక్షణ. అయితే ఫిర్యాదుల ఆధారంగా మాత్రమే స్పందించే విధానం కొనసాగితే "చర్యలు కంటి తుడుపే" అన్న అభిప్రాయం రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇకపై టీజీ రేరా సుమోటో కేసులు నమోదు చేసి, ముందస్తు పర్యవేక్షణ బలోపేతం చేస్తుందా? లేక ఫిర్యాదు ఆధారిత విధానమే కొనసాగుతుందా? అన్నదే రియల్ ఎస్టేట్ రంగంలో ప్రశ్న ఎదురౌతుంది.

విశాల భారతి





# విడుదల తేదీని ప్రకటించిన సమంత 'మా ఇంటి బంగారం'

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఎట్టకేలకు ఖరారైంది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని వేసవి కానుకగా మే 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీర్ఘ విరామం తర్వాత సమంత తెలుగు వెండితెరపై కనిపిస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో ఆమె ఒక మధ్యతరగతి ఇల్లాలి పాత్రలో కనిపిస్తూనే, ఆకట్టుకునే యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించడం విశేషం. గతంలో 'ఓ బేబీ' వంటి సూపర్ హిట్ అందించిన దర్శకురాలు నందిని రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై దీనిని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు కథ అందించగా, సంతోష్ నారాయణన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సమంత తన సోషల్ మీడియా వేదికగా "యాక్షన్ ప్యాక్డ్ గోల్డెన్ హంట్ – ఈ వేసవికి థియేటర్లలో కలుద్దాం" అంటూ కొత్త పోస్టర్‌ను పంచుకోవడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.